ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 21, జూలై 2025



ఒంగోలులో పోతురాజుకాలువ బ్రిడ్జిపై కొండలా వ్యర్థాలు


ఒంగోలులోని కొత్తపట్నం రోడ్డులో చెత్త కుప్పలా...

ఒంగోలు నగరపాలక సంస్థతోపాటు జిల్లాలోని మునిసిపాలిటీల్లో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య, ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఉన్న కొద్ది మంది రెగ్యులర్ సిబ్బందితో అధికారులు పనులు చేయించినా ప్రయోజనం కన్పించడం లేదు. ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తూ కంపుకొడుతున్నాయి. సమస్యలను పరిష్కరించాలని తొమ్మిది రోజులుగా విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న కార్మికులు ఆందోళనను మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఎక్కడి చెత్త అక్కడే!

కనిగిరి మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులు 75 మంది ఉన్నారు. వీరిలో 17 మంది మాత్రమే విధుల్లో పాల్గొంటున్నారు. మిగిలిన వారంతా సమ్మెలో ఉన్నారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న వారితోపాటు మరో 8 మందిని తీసుకొని అధికారులు పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. అంత తక్కువ మందితో పనులు చేయించడం కష్టంగా మారింది. దీంతో ఎక్కడ చెత్త కుపులు అక్కడే ఉన్నాయి.



గిద్దలూరు మునిసిపాలిటీలో ప్రధాన వీధులను మాత్రమే ఆరుగురు పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు, 25 కొవిడ్ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఇళ్ల వద్దకు వచ్చే 35 చెత్తరిక్షాలు, పుష్‌కార్ట్‌లు కాంట్రాక్టు కార్మికుల సమ్మె కారణంగా నడవడం లేదు. దీంతో మునిసిపల్ అధికారులు చెత్తను చేరవేసే మూడు ట్రాక్టర్లను నేరుగా ఇళ్ల వద్దకు పంపిస్తూ అరకొరగా సేకరిస్తున్నారు. ట్రాక్టర్లు వెళ్లలేని చిన్నచిన్న వీధుల్లోని ప్రజలు చెత్తాచెదారాన్ని ఇళ్ల బయట, కాలువల్లో వేస్తున్నారు.

- కొనసాగుతున్న మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె
- తీవ్రమవుతున్న ఆందోళన
- రెగ్యులర్ సిబ్బందితో పనులు చేపట్టినా కనిపించని ప్రయోజనం
- కంపుకొడుతున్న పట్టణాలు
- ప్రజలను వెంటాడుతున్న వ్యాధుల భయం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారంతో తొమ్మిదో రోజుకు చేరింది. వందలాది మంది కార్మికులు చీపురు చేత పట్టకపోవడంతో చెత్త సమస్య రోజు రోజుకూ అధికమవుతోంది. నిత్యం ఇళ్ల నుంచి చెత్తను సేకరించేవారు రాకపోవడంతో చెత్త డబ్బాలు నిండిపోతున్నాయి. ఒంగోలు నగరంతోపాటు మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, చీమకుర్తి, పొదిలి, దర్శి మునిసిపాలిటీల్లో పారిశుధ్య పరిస్థితి పరమ అధ్వానంగా తయారైంది. సమస్యను అధిగమించేందుకు అధికారులు ప్రత్యామ్నాయంగా పర్మినెంట్ కార్మికులతో చెత్త సేకరణకు చర్యలు చేపట్టారు. అందుకు అనుగుణంగా కార్మికులు లేకపోవడం సమస్యగా మారింది. జిల్లావ్యాప్తంగా 1,803 మంది పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. ఒంగోలు కార్పొరేషన్, ఇతర మునిసిపాలిటీలలో కలిపి 105 మంది రెగ్యులర్ కార్మికులు మాత్రమే ఉన్నారు. అంతతక్కువ మందితో వీధులను శుభ్రం చేయించడం, మురుగు తొలగించడం కష్టంగా మారింది. దీంతో అధికారులు నానాతంటాలు పడుతున్నారు. ఒంగోలు కార్పొరేషన్‌లో రోజువారీ పనివేళల కంటే అదనంగా మరో గంట పనిచేయిస్తున్నప్పటికీ పారిశుధ్యం మెరుగుపడటం లేదు.

ప్రజల్లో ఆందోళన

జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో వీధుల్లో చెత్త పేరుకుపోయి కంపుకొడుతుండటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే దోమల దాడి పెరిగింది. ఇప్పుడు కాలువల్లో మురుగు కూడా తీసే వారు లేకపోవడంతో అవి పొంగి రోడ్డుపైనే నీరు ప్రవహిస్తోంది. దీంతో వ్యాధుల భయం ప్రజలను వెంటాడుతోంది.

మునిసిపాలిటీల వారీగా కార్మికుల వివరాలు ఇవీ..

మునిసిపాలిటీ	ఆప్కాస్	కొవిడ్	రెగ్యులర్
ఒంగోలు కార్పొరేషన్	681	150	80
మార్కాపురం	290	-	-
గిద్దలూరు	57	25	6
కనిగిరి	150	15	15
చీమకుర్తి	140	-	4
దర్శి	100	-	-
పొదిలి	90	-	-
మొత్తం	1508	190	105


చంద్రబాబు, పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుపై లారీ యజమానులు హర్షం

- సింగరాయకొండలో చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం
- మంత్రి స్వామిని కలిసి కృతజ్ఞతలు

సింగరాయకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వం లారీ యజమానులకు తీపికబురు చెప్పింది. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో లారీ యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌రెడ్డి పాలనలో లారీలపై గ్రీన్ ట్యాక్స్ భారీగా పెంచారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.400 ఉన్న ఈ పన్నును వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమాంతం రూ.20వేలు చేసింది. జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వలన గత ఐదేళ్ల రవాణా రంగం పూర్తిగా కుదేలైంది. గత ఎన్నికల్లో చంద్రబాబు, పవన్, లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత ప్రభుత్వం పన్ను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో ఏడాదికి రూ.20వేల వరకు ఉన్న పన్ను ఇప్పుడు రూ. 1500 నుంచి రూ. 3వేలకు తగ్గించారు.

హర్షాతిరేకాలు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ సింగరాయకొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని లారీ యూనియన్ కార్యాలయంలో ఆదివారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ స్వామిని కలిసి ఘనంగా సత్కరించారు. గ్రీన్స్ ట్యాక్స్ తగ్గించి లారీ ఓనర్స్‌కు ఆర్థికభారం తొలగించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిగురుపాటి శేషగిరిరావు, పామర్తి మాధవరావు, పటేల్ పాల్గొన్నారు.

వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఇప్పటి వరకు ఒంగోలు, మార్కాపురం ఆర్టీవో కార్యాలయాల్లో జరిగేవని, ప్రస్తుతం ప్రైవేటుపరం చేస్తూ ఏటీఎస్ విధానం ద్వారా ఫిట్‌నెస్‌లు చేసుకోవాల్సి వస్తోందని మంత్రి స్వామి దృష్టికి లారీ యజమానులు తీసుకెళ్లారు. పాత పద్ధతిలోనే కొనసాగించాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన స్వామి వెంటనే రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. లారీ ఓనర్స్ ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని కోరారు.


ఎంఎస్‌ఎంఈ పార్క్‌లోకి వెళ్లే రహదారి

పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు

- చందలూరు పరిధిలో 102 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్ 7
- రూ.10.76 కోట్లతో పనులు పూర్తి

అటవీ నర్సరీల్లో అవినీతి మొక్కలు

- అధికారులతో అంటకాగిన వైసీపీ నేతలకు బిల్లులు
- నాసిరకంగా మొక్కలు.. లక్షలు బొక్కేసిన వైనం
- వనమహోత్సవానికి తూట్లు పొడిచేందుకు కుట్ర



7

చేపల కోసం చెరువు ఖాళీ!

- నీటిని బయటకు వదిలే విషయమై సమాచారం లేదంటున్న సర్పంచ్
- షట్టర్‌లు ఎవరు ఎత్తారో తెలియదంటున్న ఇరిగేషన్ జేఈ
- లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు


ఎడారిగా మారిన సంతనూతలపాడు పెద్ద చెరువు(ఇన్‌సెట్లో) నిండుగా చెరువు

సంతనూతలపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నిండు కుండలా ఉన్న సంతనూతలపాడు పెద్దచెరువు నెలరోజుల్లోనే ఖాళీ అయ్యింది. చెరువులో చేపలు పెంచే కాంట్రాక్టర్‌తో పాలకులు, అధికారులు కుమ్మక్కవడమే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటిని బయటకు వదిలే విషయం తమకు తెలియదని అటు పంచాయతీ సర్పంచ్, ఇటు ఇరిగేషన్ అధికారి చెప్పుండటం విస్మయం కలిగిస్తోంది. పెద్దచెరువులోని నీరు సాగుకోసమే అయినా మత్స్యశాఖ అనుమతితో ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ ద్వారా లీజు పొంది చేపల పెంచుకునే అవకాశం ఉంది. అవసరమైనప్పుడు పంటల సాగుకు నీటిని విడుదల చేయాలి. ఇదే చెరువు కింద నాలుగు పెద్ద ఊట బావులు ఉన్నాయి. వీటి ఆధారంగా సంతనూతలపాడు ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

లీజుదారుడి ఇష్టారాజ్యం

పెద్దచెరువులో చేపల పెంపకం లీజు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడు. చెరువు షట్టర్‌లకు సంబంధించిన లాక్‌ను తన వద్దనే ఉంచుకొని అవసరమైన సమయంలో యథేచ్ఛగా నీటిని బయటకు వదులుతున్నారు. నెల క్రితం నిండుగా ఉన్న చెరువును దశల వారీగా ఖాళీ చేశాడని ప్రజలు చెబుతున్నారు.

ప్రజలకు నీటి ఇక్కట్లు

పెద్దచెరువు ఖాళీ అవడంతో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు ఏర్పడ్డాయి. బావుల్లో ఊట రాక 15 రోజులకు ఒకసారి కూడా నీటిని విడుదల చేయడంలేదు. చెరువులోని నీటిని బయటకు వదిలిన విషయమై పంచాయతీ పాలకులు, సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే నీళ్లు నములుతున్నారు.

రాత్రివేళ ఎవరు వదులుతున్నారో తెలియదు

వి.వెంకటేశ్వరరెడ్డి, ఇరిగేషన్ జేఈ

చెరువులో నీటిని బయటకు పంపుతున్న విషయం తెలిసిన వెంటనే వెళ్లి లాకులను దించాం. రాత్రివేళ చెరువు షట్టర్‌లను ఎవరు ఎత్తుతున్నారో తెలియదు. లీజుదారుడిపై అనుమానంతో మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశా. నీటి సంఘం వాళ్లకు చెబితే తెలియదని సమాధానం ఇచ్చారు.

నాకు తెలియదు

దరిశి నాగమణి, సర్పంచ్

చెరువులోని నీటిని బయటకు పంపిన విషయం తెలియదు. ప్రజల ద్వారా నా దృష్టికి వచ్చింది. పంచాయతీ కార్యదర్శికి చెప్పా. ఆయన అసలు చెరువులో చేపలు పట్టే విషయమే తెలియదని సమాధానమిచ్చారు.

గోల్‌మాల్

- పుల్లలచెరువులో రూ.23లక్షలు కాజేసిన కార్యదర్శి
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్
- నాయకులు రాజీ కుదర్చడంతో మిన్నకున్న వైనం

త్రిపురాంతకం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు గ్రామ పంచాయతీలో భారీగా నిధుల గోల్‌మాల్ జరిగింది. సర్పంచ్‌కు తెలియకుండానే రూ.23లక్షలు పంచాయతీ కార్యదర్శి డ్రా చేశాడు. దీనిపై సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ నాయకులు కలుగజేసుకుని కార్యదర్శి, సర్పంచ్ మధ్య రాజీ చేసి ఆ మొత్తంలో కొంత ఇచ్చేలా ఒప్పందం కుదిర్చినట్లు తెలిసింది. ఆతర్వాత సర్పంచ్ చల్లబడినట్లు కనిపిస్తోంది. 2024 డిసెంబర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.18లక్షలు, పన్ను వసూలు తాలూకు మరో రూ.5లక్షలను పంచాయతీ కార్యదర్శి వై.శ్రీనివాసులు డ్రా చేశారు. ఆ మొత్తంలో 80శాతం బిల్లులను రాంబాబు పేరుతో మార్చినట్లు ఆన్‌లైన్‌లో చూసి సర్పంచ్ ఓబులేసు విస్తుపోయారు.

అసలెలా జరిగింది?

బిల్లులు పెట్టేటప్పుడు, నిధులు సీఎఫ్ఎంఎస్‌లో నమోదు చేసేటప్పుడు సర్పంచ్ కూడా ఆమోదం తెలపాలి. తన ఖాతాకు లింక్ అయి ఉన్న ఫోన్ నంబరుకు వచ్చే ఓటీపీ చెప్పాలి. ఇవన్నీ జరగకుండానే కార్యదర్శి ఈ నిధులు ఎలా డ్రా చేశాడన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనకు తెలియకుండా కార్యదర్శి రూ.23లక్షలు కాజేశాడని నేతలకు, జిల్లా అధికారులకు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. దీనిని సమసిపోయేలా చేయాలనుకున్న నేతలు వారిద్దరి మధ్య రాజీ కుదిర్చి డ్రా చేసిన నగదులో కొంత సర్పంచ్‌కు ఇప్పించే ఏర్పాటు చేశారని తెలిసింది. అవి ఇచ్చారో లేదో తెలియదు కాని జిల్లా పంచాయతీ అధికారులు మాత్రం దీనిని సీరియస్‌గానే తీసుకున్నారని సమాచారం.అనంతరం ఏం జరిగిందో ఏమోకానీ వారు కూడా మిన్నకుండిపోయినట్లు తెలిసింది. ఈ ఎపిసోడ్‌లో కార్యదర్శితోపాటు గ్రామంలో అందరినోటా వినిపించిన మాట రాంబాబు అనే పేరు. దాదాపు రూ.18లక్షలు రాంబాబు ఖాతాలోకి పంపి డ్రా చేశారు. కార్యదర్శి తనకు బినామీగా ఉండే వ్యక్తుల పేరుతో నిధులు మార్చుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ఒంగోలులోని కర్నూలు రోడ్డులో వర్షపు నీరు

జోరు వాన

- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీగానే..
- సాగుకు మరింత ఉపయుక్తం

ఒంగోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీగా పడింది. చాలాప్రాంతాల్లో మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. కొన్నిచోట్ల ఏకంగా 37నుంచి 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకల్లా వాతావరణంలో పూర్తిగా మార్పు వచ్చింది. అత్యధిక ప్రాంతాల్లో మబ్బులు కమ్మి జల్లులు ప్రారంభమయ్యాయి. చాలా చోట్ల రాత్రి వరకూ పడుతూనే ఉన్నాయి. కొన్నిచోట్ల భారీ వర్షం కురిసింది. ఏపీఎస్‌డీపీఎస్ సమాచారం ప్రకారం జిల్లాలో ఆదివారం సాయంత్రం 4 నుంచి ఆరు గంటల మధ్య గరిష్ఠంగా టంగుటూరులో 74.75 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ రెండు గంటల వ్యవధిలోనే సంతనూతలపాడు మండలం మంగమూరులో 61.0, చిలకపాడులో 55.0 మి.మీ కురిసింది. కురిచేడు మండలం దేకనకొండలో 53.0, చీమకుర్తి మండలం పల్లామల్లిలో 41.0, సంతనూతలపాడులో 36.25, దొనకొండ మండలం చందవరంలో 3.0, కొత్తపట్నంలో 30.40, ఒంగోలులోని కలెక్టరేట్ ప్రాంతంలో 28.50, చీమకుర్తి మండలం నిప్పట్లపాడులో 26.50, దర్శి మండలం కొత్తపల్లిలో 26.0 మి.మీ నమోదైంది. ఎర్రగొండపాలెం, ముండ్లమూరు, సింగరాయకొండ, మద్దిపాడు, పొదిలి తదితర మండలాల్లో ఒక మోస్తరుగా కురిసింది. ఇతర ప్రాంతాల్లోనూ జల్లులు పడ్డాయి.

ఊపందుకోనున్న పంటల సాగు

రెండు రోజుల క్రితం జిల్లా అంతటా ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో వర్షం పడటంతో పంటల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో తాజా వర్షం మరింత ఉపయుక్తం కానుంది. దీంతో సాగు ఊపందుకోనుంది. ఆదివారం సాయంత్రం ఒంగోలులో దాదాపు రెండు గంటలపాటు తెరిపిలేకుండా వర్షం కురవడంతో నగరం జలమయమైంది. ప్రధాన రోడ్లపై కాలువలను తలపిస్తూ నీరు పారింది. పలుచోట్ల మరుగునీరు రోడ్లపైకి వచ్చి జనం అవస్థ పడ్డారు. చాలా చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ద్విచక్రవాహనదారులు రోడ్లపై వెళ్లేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఈ వారంలో వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.


ఒంగోలు కర్నూలురోడ్డులో వాననీటిలో మునిగిన స్కూటీతో ఇబ్బందులుపడుతున్న వ్యక్తి

నగరంలో పేరుకున్న చెత్తకుప్పలు

- తీవ్రమవుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారుల దృష్టి



జేసీ బంగ్లాకు వెళ్లే రోడ్డు మార్గంలో చెత్తాచెదారం



ఆర్అండ్‌బీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న చెత్త



దేవుడుచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో..

ఒంగోలు కార్పొరేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. దీంతో వీధులన్నీ కంపుకొడుతుండగా, రోజువారీగా ఇళ్లలో చెత్తను సేకరించేవారు రాకపోవడంతో చెత్తడబ్బాలు నిండిపోతున్నాయి. ఒంగోలు నగరంలో 50 డివిజన్‌లు ఉండగా, నగర జనాభా 3లక్షల చేరింది. దీంతో ప్రతిరోజు సుమారు 126 టన్నుల తడి, పొడి చెత్త ఉత్పత్తి అవుతుంది. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ పరిధిలో 5 పారిశుధ్య సేకరణ డివిజన్‌లుగా విభజించారు. అందులో పర్మినెంట్ పారిశుధ్య కార్మికులు 80 మంది, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు 681 వరకు ఉన్నారు. గత తొమ్మిది రోజులుగా పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగడంతో వీధుల్లో పారిశుధ్యం లోపిస్తోంది.

ఉండీ..ఉపయోగం లేక..

ప్రతిరోజు నగరంలోని 61,694 నివాస గృహాలలో చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరిస్తుంటారు. వాటితోపాటు వీధులను శుభ్రపరచడం, కాలువల్లో మురుగు తొలగింపు నిరంతర ప్రక్రియ. అందుకోసం 18 ప్రైవేటు ట్రాక్టర్స్, రెండు కార్పొరేషన్ ట్రాక్టర్స్, ఒక డంపర్ ప్లేజర్, మరో 80 చెత్త సేకరణ డబ్బాలను నగరంలో ఏర్పాటు చేశారు. అంతేగాకుండా 15 ఆయిల్ స్ప్రేయర్స్‌తో ప్రతిరోజు ఉదయం 5-30 నుంచి 10-30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు సుమారు 315 కి.మీ. విస్తరించిన రోడ్లు, 740 కి.మీ. సీసీడ్రైన్‌లు, కచ్చా కాలువల్లో మురుగు తొలగించడం ప్రజారోగ్య విభాగం బాధ్యత. నిరంతరం చేపట్టే ఈ పారిశుధ్య విభాగం పర్యవేక్షకులుగా ఇద్దరు శానిటరీ సూపర్‌వైజర్లు, ముగ్గురు శానిటరీ ఇన్‌సెక్టర్లతోపాటు వీరిపై అజమాయిషీ అధికారిగా అసిస్టెంట్ కమిషనర్ పనిచేస్తున్నారు. వందల సంఖ్యల్లో కార్మికులు, చెత్త సేకరణ వాహనాలు ఉన్నప్పటికీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె ప్రభావంతో ఎక్కడి చెత్త అక్కడనే పేరుకుపోయింది.

పారిశుధ్యం మెరుగు కోసం..

అయితే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్రభుత్వం పారిశుధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించడం కోసం ప్రతి నెలా 3వ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వామ్యం చేసింది. ఇదిలా ఉండగా నగరంలో పారిశుధ్యం మెరగుకోసం ప్రతిరోజు ఇళ్లలోని చెత్త సేకరణ కోసం రియల్ టైమ్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్టీఎంఎస్)ను గతంలోనే టీడీపీ అమలు చేసింది. దీంతో కార్మికుల్లో బాధ్యతను పెంచడంతోపాటు, పారిశుధ్య సమస్యలేకుండా చూడాలన్నదే ఉద్దేశం. కాగా కార్మిక సంఘాల పిలుపుతో వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అందించాలని ఇలా పలు సమస్యలపై 2016 సెప్టెంబరులో, 2017 డిసెంబరులో 2003లో కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. తాజాగా గత తొమ్మిది రోజుల నుంచి విధులు బహిష్కరించి, నిరవధిక సమ్మె చేపట్టడంతో నగరంలో 681 మంది కార్మికులు విధులను బహిష్కరించారు. దీంతో వీధులన్నీ దుర్గంధంగా మారాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. అయితే సుమారు 123 చ. కి.మీ. విస్తరించిన ఒంగోలు నగరంలో ప్రతిరోజు 126 టన్నుల ఉత్పత్తి అయ్యే చెత్తను సేకరించడం సమస్యగా మారింది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీంతో వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పల తొలగింపుకే పరిమితం కావడంతో నగరంలోని పరిస్థితి దారుణంగా మారింది.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రొయ్యల సాగు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా రొయ్యల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఈదర యశ్వంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1.50కి యూనిట్ విద్యుత్ ధరను ఆక్వా/నాన్ ఆక్వాజోన్ అనే తేడా లేకుండా అన్ని చెరువులకు వర్తింపజేయాలన్నారు. 2019 ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్లను రొయ్యల రైతులకు అందించాలని, కరోనా తర్వాత పెరిగిన ఆక్వా కెమికల్స్ ధరలను తగ్గించాలని తదితర డిమాండ్లతో ధర్నాను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని రొయ్యల రైతులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి : యూటీఎఫ్

ఒంగోలు విద్య, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. బదిలీలు ముగిసి నెల రోజులు దాటిన కొత్త పోస్టులకు పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. జీతాలు చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ బదిలీ అయిన టీచర్లకు రిలీవర్ రాని కారణంగా వారు పాత స్థానాల్లోనే పని చేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎస్సీ కొత్త పోస్టులు ఇచ్చినా ఇంకా సుమారు 500 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితి ఉందని చెప్పారు. ఖాళీ పోస్టుల్లో అర్హులైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి విద్యార్థులకు విద్యను అందించాలని కోరారు. పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని, బకాయిలు ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎస్.రవి, ఉమామహేశ్వరి, చిన్నస్వామి, ఎం.సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు

నాగులుప్పలపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బి.నిడమానూరు జడ్పీ హైస్కూలులో ఒంగోలు ఎయిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు బీవీ.రమణారెడ్డి, రామలింగేశ్వరావు, నీరజ, కార్తీక్, శ్రీహర్ష 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాకా శ్రీనివాసరెడ్డి, మారెడ్డి వీరారెడ్డి, దేవరపల్లి అంజిరెడ్డి, మారెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

ఒంగోలు కల్చరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏఎంసీ మాజీ డైరెక్టర్ మారెళ్ల వివేకానంద మాతృమూర్తి కాశీరత్నమ్మ తృతీయ వర్ధంతిని స్థానిక అన్నవరప్పాడు శివం ఫౌండేషన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కుటుంబసభ్యులు, అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివేకానంద ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహిళాభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు టి.అరుణ, పేలప్రోలు రామకృష్ణ పరమహంస(బిర్లా), బ్రహ్మానందం, మారెళ్ల సుబ్బారావు, మాజీ మునిసిపల్ చైర్మన్ యక్కల తులసీరావు, దామచర్ల పూర్ణచంద్రరావు, కోనూరి శ్రీనివాసరావు, అయ్యన్న, రావుల పద్మజ, దన్నారపు మస్తాన్‌రావు పాల్గొన్నారు.

కొండపి ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం

కొండపి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం పడింది. ఇప్పటి వరకు చెదురుమదురు వర్షాలు పడ్డాయి. అల్పపీడన ప్రభావంతో ఈవారంలో మరింత వర్షం పడితే రైతులు కంది, మేత జొన్న పైర్లతోపాటు వరి, మిరప, పొగాకు నార్లు పెట్టేందుకు సిద్ధమవుతారు. ప్రస్తుతం కురిసిన వర్షం ప్రస్తుతం పొలాల్లో ఉన్న నువ్వు పైరుకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

ఘనంగా లయన్స్ సిటిజన్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కల్చరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ 39వ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక సంతపేట కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లబ్ అధ్యక్షుడు చలువాది శ్రీహరి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ సేవారంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుప్రఖ్యాతులు ఉన్న లయన్స్ క్లబ్ ఒంగోలు ప్రజలకు సేవలందించటం అభినందనీయం అన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా పబ్బిశెట్టి రాజేష్, కార్యదర్శిగా అపోలో ఆనందబాబు, కోశాధికారిగా ఆర్.ఎస్.ఫ్యాషన్ శ్రీనులు ఎన్నికయ్యారు. తమకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నామినేని మోహనరావు, క్లబ్ గవర్నర్ హరిప్రసాద్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మాంటిస్సోరి ప్రకాష్, డీవీ.రాఘవ పాల్గొన్నారు.

జీవాల మేతకు ప్రభుత్వ భూములను కేటాయించాలి

- ఏపీ గొర్రెల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

నాగులుప్పలపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు మేత మేసేందుకు ప్రభుత్వ భూములు కేటాయించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూసపాటి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. సంఘం మండల కమిటీ సమావేశం ఉప్పుగుండూరులోని యాదవ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గొర్రెలు, మేకల పెంపకందార్లను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ సీజన్‌లో పంటల సమయంలో జీవాలకు మేత వనరులు నిలబెట్టుకొనేందుకు స్థలాలు లేక కాపర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎదుర్కోవడం డొంకలు, దారులు, కుంటలు ఆక్రమణలకు గురికావడంతో జీవాలకు గ్రాసం కొరత ఏర్పడి దూర ప్రాంతాలకు వలస వెళ్లి మేపుకోవాల్సి వస్తుందన్నారు. ప్రయాణ సమయంలో రోడ్డు ప్రమాదాల బారిన పడటం, జీవాలు నిలుపుకున్న ప్రాంతంలో పాముకాటులు, పిడుగుపాటులకు గురై అనేక మంది కాపరులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మేజర్ పంచాయతీ ఉప్పుగుండూరులో 5వేల గొర్రెలు, పెద్ద ఎత్తున పశువులు ఉన్నాయని, ఇక్కడి పశువైద్యశాలలో సీనియర్ వైద్యులను నియమించి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. గొర్రెల బీమా సౌకర్యంపై ప్రభుత్వం ప్రచారంలో చూపిస్తున్న శ్రద్ధ అమలు చేయడంలోనూ చూపించాలన్నారు. కాపరులకు 50 శాతం సబ్సిడీపై రుణాలు అందించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా నక్కల శ్రీకాంత్, కొణికి రాఘవ, సభ్యులు మసిముక్కు భాస్కరరావు, భట్లు వెంకట్రావు, ఈర్ల మహేష్, కొండపి నాగరాజు, వీరభద్రయ్య, మసనం శివయ్య, అత్తంటి అంజయ్య, గుమ్మా వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో కాకాని సుబ్బారావు, కళ్లగుంట శ్రీనివాసరావు, ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల కార్యవర్గ సభ్యులు

సింగరాయకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సింగరాయకొండలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా జేవీ సుబ్బారావు, ప్రధానకార్యదర్శిగా సీహెచ్.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ.సురేష్‌బాబు, ఎ.బ్రహ్మయ్య, జె.సునీత, కార్యదర్శులుగా జె.శ్రీనివాస్, బి.పూర్ణచంద్రరావు, నరేంద్రకుమార్, రాధ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.రవి, పరిశీలకుడిగా ఎస్‌కే.ఖాదర్ బాషా వ్యవహరించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులైన జేడీ.సుబ్బారావు, జయకుమార్‌లను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- మంత్రి స్వామి



తహసీల్దార్లతో సమీక్షిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, కొండపి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్లు ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, అదేవిధంగా ఎంపీడీవోలు గ్రామాల్లో పచ్చదనం, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. తూర్పునాయుడుపాలెంలోని తన కార్యాలయంలో మంత్రి ఆదివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులను పదేపదే తిప్పుకోవద్దని మంత్రి సూచించారు. పరిష్కారానికి వీలున్న పనిని వెంటనే పూర్తిచేయాలని, లేదా వారికి గడువు చెప్పి ఆ గడువు తేదీలోపు సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. రైతుల భూముల మ్యూటేషన్, సర్వే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఎంపీడీవోలు గ్రామాల్లో, పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆదేశించారు. గ్రామాల్లో, వీధిలైట్లు సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సైడు కాల్వల్లో మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, ప్రజలు అనారోగ్యం బారినపడకుండా, దోమల వృద్ధి జరగకుండా సత్వర చర్యలు క్షేత్రస్థాయి సిబ్బంది చేపట్టాలని ఎంపీడీవోలను మంత్రి ఆదేశించారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్



కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం రాత్రి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్ ఏడాదిపాలనలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ఆర్.అంకారావు, తన్నీరు శ్రీను, మన్నం రంగనాయకమ్మ, ఎం.శ్రీను, నాయబ్, జనార్దన్, శంకర్, నరసింహారావు, అంజయ్య, పద్మ, సుబ్బారెడ్డి, శ్రీను, మాధవి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి లక్ష్యం

మద్దిపాడు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తు న్నదని టీడీపీ నాయకుడు దొప్ప శేషయ్య అన్నారు. మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెంలో ఆదివారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ తుమ్మల వీరాంజనేయులు, మండవ గోవిందరాజులు, గ్రామ అధ్యక్షుడు కొప్పోలు విశ్వనాథం, ఆర్ల రామాంజనేయులు, బొబ్బూరి రాంబాబు, మండువ లక్ష్మీనారాయణ, దీపు చైతన్య, మండవ లింగేశ్వరరావు, దొప్ప సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షుడిగా 'తొగటి'

- ఘనంగా ప్రమాణస్వీకారం



బాలికలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

చీమకుర్తి, జూలై20(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం చీమకుర్తిలోని డాక్టర్ చెరుకూరి వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియం ఆవరణలో అట్టహాసంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా తొగటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా పారెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా శంకర్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా అన్నే రత్నప్రభాకర్, ఇండక్షన్ అధికారిగా అంకమ్మచౌదరి వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీమకుర్తి రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్ నేతృత్వంలో అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. తదుపరి బాలికలకు సైకిళ్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెరుకూరి రఘుకిరణ్, బసవరాములు, మన్నం ప్రసాద్, రావిపాటి రాంబాబు, యడ్లపల్లి రామబ్రహ్మం, గొల్లపూడి వెంకట్రావు, అంబటి వీరారెడ్డి, పరాంకుశం శ్రీనివాసమూర్తి, కమిషనర్ రామకృష్ణయ్య, సభ్యులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

- ఐదోరోజుకు చేరుకున్న సమ్మె



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి, జూలై20(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల అనుసరిస్తున్న అలసత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఆదివారం చీమకుర్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో ర్యాలీ జరిపారు. కాగా మున్సిపల్ అధికారులు పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 92 మంది కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వీరంతా సమ్మెలోకి వెళ్లారు. దీంతో కోవిడ్ సమయంలో తాత్కాలికంగా తీసుకున్న 25మంది కార్మికులతో ప్రస్తుతం పట్టణంలో పారిశుధ్య పనులను అధికారులు నిర్వహించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. వీరు ప్రధాన రహదారుల్లో పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించకపోవటంతో గుమ్మాల ముందు చెత్త పేరుకుపోతోంది. ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపితే సమస్య తీవ్రరూపం దాల్చకుండా ఉంటుంది.

సమానత్వం కోసం ఉద్యమించాలి



జెండాను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉదయిని

ఒంగోలు కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష సమానత్వం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యురాలు ఎస్.ఉదయని పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం ఐద్వా నగర మహాసభలో ఆమె ఐద్వా జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఉదయని మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా కుటుంబంలోనూ, సమాజంలోను ఎదురవుతున్న ఆటంకాలను అధికమిస్తూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారని తెలిపారు. అయితే తగిన పోషకాహారం మహిళలకు అందుబాటులో లేకపోవడంతో రక్తహీనత, ఎముకలు పెలుసుబారటం లాంటి అనేక వ్యాధులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకురాలు శ్రీనివాసకుమారి మాట్లాడుతూ ఐద్వా మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, బి.గోవిందమ్మ, జి.ఆదిలక్ష్మి, రాజేశ్వరి, బి.రాజ్యలక్ష్మి, నరసమ్మ, కె.రాణి, జి.కళ్యాణి, పి.ప్రేమలత, కె.విజయలక్ష్మి, రంగమ్మ పాల్గొన్నారు.



నిధుల కోసం ఆందోళన బాట

- కేంద్రం ఇచ్చిన సొమ్మును విడుదల చేయాలి
- జిల్లాలోని పంచాయతీలకు రూ. 35 కోట్ల దాకా బకాయిలు
- అలాగే ఎన్నికల హామీలను అమలు పరచాలని డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్‌లు రోడ్డెక్కుతున్నారు. ఆరు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు కేటాయించింది. అయితే ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయలేదు. దీంతో సర్పంచ్‌లు ఆందోళన బాటపట్టారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా రాత్రికిరాత్రికే హాంఫట్ చేయడంతో సర్పంచ్‌లు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. అప్పటి ప్రతిపక్షహోదాలో ఉన్న టీడీపీ సర్పంచ్‌లకు మద్దతుగా నిలిచింది. నిరంతరం వైసీపీపై పోరాటం చేసినా ఫలితం కనపించలేదు. దీంతో జిల్లాలో దాదాపు ఎక్కువ మంది సర్పంచ్‌లు ఆ పార్టీకి వ్యతిరేక అయ్యారు. తరువాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రెండుసార్లు ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాగా మొదటిసారి వచ్చిన నిధులను ప్రభుత్వం నేరుగా పంచాయతీ అకౌంట్లకు జమచేసింది. రెండోసారి వచ్చిన నిధులను ఆయా పంచాయతీల జనాభాకు అనుగుణంగా నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అలా జిల్లాలోని 729 గ్రామ పంచాయతీలకు సుమారు రూ. 35 కోట్ల వరకు ఆర్థిక సంఘం నిధులు వచ్చాయి. అయితే ఆ నిధులను ఆరు నెలల క్రితం విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా ఇంత వరకు పంచాయతీ అకౌంట్లకు జమ కాలేదు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

దీంతో సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో మంత్రులు, సంబంధిత అధికారులను కలిసి విన్నవించారు. ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినా నిధులు మాత్రం జమకాలేదు. దీంతో సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలనూ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం సర్పంచ్‌లకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని రూ. 3వేల నుంచి రూ. 10వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ హామీని కూడా అమలు చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. అలాగే రాష్ట్ర బడ్జెట్‌లో ఐదుశాతం నుంచి పదిశాతానికి నిధుల పెంపు, సర్పంచ్‌లకు ప్రొటోకాల్, పంచాయతీల ద్వారా చేసిన తీర్మానాలను అమలు తదితర హామీలను అమలు చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌లు ఆందోళన బాటపట్టారు.




హామీలను అమలు చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఆరునెలల క్రితం వచ్చిన ఆర్థికసంఘం నిధులను ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. ఆ నిధుల కోసం పోరాడుతూనే ఇంకొకవైపు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. అందుకోసం సంఘం ద్వారా సర్పంచ్‌లందరినీ ఏకం చేసి అవసరమైతే ఆందోళనలు నిర్వహించేందుకు వెనుకాడం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలి.

- బెజవాడ శ్రీరామమూర్తి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

ట్రిపుల్ ఐటీలో సీనియర్ల వేధింపులు

- జూనియర్ విద్యార్థిపై దాడి
- 24 మందిని ఇంటికి పంపించిన అధికారులు
- నేడు విద్యార్థుల వెల్ఫేర్ కమిటీ, సిబ్బందితో సమావేశం



ఒంగోలు క్రైం,జూలై20(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీలో సీనియర్ విద్యార్థుల వేధింపులు రచ్చకు ఎక్కాయి. ఈనెల 17 న జూనియర్ విద్యార్థిని కొంత మంది సీనియర్లు రూమ్‌కు పిలిపించి దాడి చేశారు. విషయం బయటకు చెబితే సహించమని బెదిరించారు. దీంతో ఆ విద్యార్థి ఎవరికీ చెప్పకుండా మిన్నకుండి పోయాడు. అదే సమయంలో కళాశాల డైరెక్టర్ సెలవులో ఉండటంతో సీనియర్ల వేధింపుల విషయం ఏవో చంద్రశేఖర్ దృష్టికి చేరింది. జూనియర్ విద్యార్థిపై దాడి చేసిన రూమ్‌లో ఉన్న 24 మందిని తాత్కాలికంగా ఇంటికి పంపించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొందరు చేసిన తప్పుకు రూమ్‌లో ఉన్న పిల్లలందరిపై చర్యలు తీసుకోవడం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

సోమవారం విద్యార్థుల వెల్ఫేర్ కమిటీ,సిబ్బందిని పిలిచి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. అదే సమయంలో పోలీసు అధికారులు కూడా ఈ విషయంపై ఆరా తీశారు. ఈమేరకు ఒంగోలు డీఎస్పీ కూడా సోమవారం ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడనున్నట్లు తెలిసింది.

29 లోపు నవోదయకు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు విద్య, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యాసంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ఈనెల 29లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ప్రవేశపరీక్షకు దరఖాస్తులు చేసేలా మండల విద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఐదోతరగతి విద్యార్థులందరూ నవోదయ ప్రవేశ పరీక్ష రాసేలా చూడాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.



స్థల యజమానిపై రాళ్లు డంప్ చేస్తున్న వ్యక్తులు

స్థలంలో అక్రమంగా కొండరాళ్లు

- అడ్డుకున్న యజమానిపై వాటిని డంప్
- తీవ్ర గాయాలు.. కేసు నమోదు

మద్దిపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడు గ్రామంలోని స్థలంలో అక్రమంగా కొండరాళ్లు వేస్తున్న విషయంలో వివాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చలిచీమ శివఆంజనేయబాబు, గొల్లపూడి రామచంద్రరావులు ట్రాక్టర్‌తో కొండరాళ్లను శ్రీధర్‌బాబు ఇంటిస్థలంలో వేసేందుకు ప్రయత్నించారు. శ్రీధర్‌బాబు ట్రాక్టర్‌ను అడ్డుకున్నాడు. ఆ సమయంలో ట్రాక్టర్ హైడ్రాలిక్ పైకి ఎత్తడంతో బండరాళ్లు శ్రీధర్‌పై పడి తీవ్రగాయాలయ్యాయి. ఆయన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో చేరారు. అక్కడి అవుట్ పోస్టు పోలీసుల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మార్టూరు, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బేపల్లిలోని ముస్లిం కాలనీలో పఠాన్ మీరాబి(25) ఆదివారం సాయంత్రం అనుమానాస్పదంగా మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు షేక్ కరిముల్లా, పఠాన్ మీరాబీలకు నాలుగు నెలల క్రితం వివాహమైంది. పల్నాడు జిల్లా విప్పర్ల మీరాబి స్వగ్రామం. అయితే ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో మీరాబి ఇంట్లో అనుమానస్పదంగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సైదా సంఘటనా స్థలం వద్ద కు వెళ్ళి పరిశీలించారు. భర్త కరిముల్లాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉచిత శిక్షణ

టంగుటూరు, కొండపి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువకులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ అందిస్తామని రాష్ట్ర మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి తన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఇందుకు సంబంధించి ఆయాశాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలుగా బ్యాంక్ పీవో, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

టంగుటూరు, కొండపి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): టంగుటూరు సమీపంలోని బుచ్చిరాజుపాలెం వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని డ్రోన్ సాయంతో గుర్తించి ఆదివారం సాయంత్రం వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై నాగమల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూదరుల వద్ద నుంచి 14,840 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రోన్ సాయంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు చేపడతామని ఎస్సై హెచ్చరించారు.

పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు

- చందలూరు పరిధిలో 102 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్
- రూ.10.76 కోట్లతో పనుల పూర్తి

దర్శి, జూలై 20(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అందులోభాగంగా మండలంలోని చందలూరు రెవెన్యూలో 102 ఎకరాల్లో రూ.10.76 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో పార్క్ నిర్మాణం పనులు వేగవంతంగా జరిగాయి. కొద్దిరోజుల క్రితం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఆమె పార్క్‌ను ప్రారంభించారు. పార్క్‌లో విశాలమైన తారురోడ్లు, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని మౌలిక సౌకర్యాలు ఏర్పాటుచేయటంతో ఇకపై అక్కడ చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం పలుకుతారని భావిస్తున్నారు.

ఇప్పటికే కురిచేడు మండలంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. దొనకొండలో పారిశ్రామిక అభివృద్ధికి పార్క్ నిర్మించిన విషయం తెలిసిందే. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు దర్శి నియోజకవర్గంలో చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసి పరిశ్రమల కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ అమలు దిశగా ముందుకు సాగుతుంది. దర్శి-దొనకొండ ప్రాంతాల్లో ఔత్సాహికులు పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



ఎంఎస్ఎంఈ పార్క్‌లో వేసిన రోడ్లు



ఎంఎస్ఎంఈ పార్క్ తెలిపే బోర్డు

డబ్బులు రాలేదని అడిగినందుకు పెట్రోల్ కొట్టే వ్యక్తిపై దాడి

కొండపి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గతంలో పెట్రోల్ కొట్టించుకున్నారు.. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించామన్నారు.. రాలేదు.. ఇప్పుడు పెట్రోల్ కొడితే డబ్బులు వస్తాయా? అని అడిగినందుకు పెట్రోల్ కొట్టే వ్యక్తిపై ముగ్గురు యువకులు పిడిగుద్దులతో దాడిచేశారు. ఈ ఘటన కొండపిలోని టంగుటూరు రోడ్డులోని పొగాకు వేలం కేంద్రం సమీపంలోని పెట్రోల్ బంక్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కొండపికి చెందిన ఇనకొల్లు శేషయ్య పెట్రోల్ బంకులో పంప్ వద్ద బాయ్‌గా పనిచేస్తున్నాడు. పెదకండ్లగుంట గ్రామానికి చెందిన దాచర్ల సుమంత్ అతని స్నేహితులు బంకు వద్దకొచ్చి పెట్రోల్ కొట్టాలని, తాము ఫోన్‌పే చేస్తామని శేషయ్యకు చెప్పారు. గతంలో కూడా ఇలాగే పెట్రోల్ కొట్టించుకుని వెళ్లారు. ఫోన్‌పే ద్వారా చెల్లించామన్నారు. కాని డబ్బులు రాలేదని శేషయ్య అనడంతో ఆగ్రహం చెందిన సుమంత్ అతని స్నేహితులు శేషయ్యపై దాడి చేసి పదేపదే పిడిగుద్దులు కురిపించారు. తీవ్ర గాయాలపాలైన శేషయ్యను ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అకారణంగా శేషయ్యపై దాడి చేయడం పట్ల పలు పెట్రోల్ బంకుల యజమానులు, వర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెట్రోలు బంక్ సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయిన దాడి దృశ్యాలు

అత్తారింటికి వెళ్లి వస్తూ..

- ఆగిఉన్న లారీని ఢీకొట్టిన మోటార్‌బైక్
- సింగరాయకొండ బీకేటీ ఫ్యాక్టరీ ఎదురు ప్రమాదం
- భర్త మృతి

సింగరాయకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని మోటార్ బైక్ ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలపాలై రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలో బీకేటీ ఫ్యాక్టరీ ఎదురుగా ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కందుకూరు మండలం పలుకూరు గ్రామానికి చెందిన ఎస్కే. సుభానీ టైలరింగ్(40) పనిచేస్తూ జీవిస్తున్నాడు. వారం రోజుల క్రితం తన భార్య ఆఫ్రిన్‌తో కలిసి అత్తగారి ఊరైన ఈతముక్కల వెళ్లారు. మళ్లీ ఆదివారం తిరిగి భార్యతో కలిసి మోటర్ బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. జాతీయ రహదారిపై బీకేటీ ఫ్యాక్టరీ వద్దకు చేరుకునేసరికి రోడ్డుపై ఆగి ఉన్న నెల్లూరు వైపు వెళ్తున్న లారీని బైక్ బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో సుభానీకి తీవ్రగాయాలయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులు స్పందించి క్షతగాత్రుడైన సుభానీని రోడ్డు పక్కన కూర్చోబెట్టారు. అప్పటికే అతను తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. పక్కనే ఉన్న భార్య అతనిని ఒళ్లో కూర్చోబెట్టుకుని కన్నీటిని దిగమింగుతూనే సపర్యలు చేసింది. ఈలోపు 108 వాహనం రావడంతో ఒంగోలు రిమ్స్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆగిఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్రవాహనం (ఇన్‌సెట్లో) అపస్మారక స్థితిలో ఉన్నభర్తను చూసి రోదిస్తున్న భార్య ఆఫ్రిన్

అటవీ నర్సరీల్లో అవినీతి మొక్కలు

- అధికారులతో అంటకాగిన వైసీపీ నేతలకు బిల్లులు
- నాసిరకంగా మొక్కలు పెంచి లక్షలాది రూపాయలు బొక్కేసిన వైనం
- వన మహోత్సవానికి తూట్లు పొడిచేందుకు కుట్ర

తర్లుపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం అటవీశాఖ, ఉపాధి నిధులతో నర్సరీలలో మొక్కలు పెంచుతుంది. మండలంలోని కలుజువ్వలపాడు, తుమ్మలచెరువు, తాడివారిపల్లెలో సోషల్ ఫారెస్ట్ నర్సరీలు ఉన్నాయి. ఈ నర్సరీల్లో పలు అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి. లక్షలాది మొక్కలు పెంచుతున్నట్లు రికార్డుల్లో చూపించి, నాసిరకంగా మొక్కలు పెంచుతూ లక్షలాది రూపాయలు బొక్కేస్తున్నారు. అధికారులతో అంటకాగిన వైసీపీ నాయకులతో కుమ్మక్కై వారి ఖాతాల్లోకి బిల్లులను జమ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు మాత్రం వైసీపీ నాయకుల పేర్లతో బిల్లులు పెడుతున్నారు. ప్రతి ఒక్క నర్సరీకి కమిటీలను నియమించి చైర్మన్, వైస్ చైర్మన్ ద్వారా మెయింటినెన్స్ డబ్బులు డ్రా చేయాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా వారికి అనుకూలమైన వైసీపీ నాయకుల పేర్లతో బిల్లులు పెట్టుకొని ఇద్దరు పంచుకు తింటున్నారు. తర్లుపాడు మండలంలో 3 నర్సరీలలో 2024-25కి గానూ సుమారు 15లక్షల మొక్కలు పెంచుతున్నట్లు నిధులు డ్రా చేస్తున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు పేర్లతో దొంగ బిల్లులు మార్చుకుంటూ పంచుకుతింటున్న ఫారెస్ట్ అధికారులు ప్రస్తుతం కూడా వైసీపీ నాయకుల పేర్లతోనే కొనసాగిస్తున్నారు. కలుజువ్వలపాడు హైటెక్ నర్సరీలో ఉన్న మొక్కలు కూడా గట్టి పట్టి ఎందుకు పనికి రాకుండా పోయింది.

ఈ నర్సరీలో జూన్ 26న బుడ్డపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడి పేరుతో రూ.3.20లక్షల బిల్లును వేశారు. ఇలా 3 నర్సరీలలో కూడా ఫారెస్ట్ అధికారులు అక్రమాలకు పాల్పడుతూ నామమాత్రంగా మొక్కలు పెంచుతూ లక్షలాది రూపాయలు వైసీపీ నాయకులతో కలిసి పంచుకుతింటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జూన్ 5న జరిగిన వన మహోత్సవానికి కూడా మండలంలో మొక్కలు పంపిణీ చేయకుండానే పంపిణీ చేసినట్లు రికార్డులు సృష్టించారు. ఈ నర్సరీలో జరుగుతున్న అవినీతిపై జిల్లా స్థాయి అధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపితే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



కలుజువ్వలపాడు నర్సరీలో నాసిరకం మొక్కలు (ఇన్‌సెట్లో) అటవీశాఖ వన విభాగం బోర్డు

ఫారెస్ట్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

కలుజువ్వలపాడులో జూన్ 5న జరిగిన వన మహోత్సవానికి ఫారెస్ట్ అధికారులు మొక్కలను పంపిణీ చేయకుండా, హాజరుకాకపోవడంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నీరు గార్చాలని అధికారులు, వైసీపీ నాయకులు కుట్ర పన్నారని ఆరోపించారు. మండలంలోని 3 నర్సరీలు ఉన్నప్పటికీ వన మహోత్సవానికి మొక్కలు పంపిణీ చేయకపోవడానికి కారణం ఏమిటని ఎమ్మెల్యే కందుల ప్రశ్నించారు. మార్కాపురం నియోజకవర్గంలో సోషల్ ఫారెస్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు లక్షలాది రూపాయల నిధులు డ్రా చేస్తున్నారని, వైసీపీ నాయకులతో అంటకాగారని ఆయన విమర్శించారు. ఈ మేరకు ఫారెస్ట్ అధికారులపై అప్పట్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు.

మిరప సాగుకు సిద్ధమైన రైతులు

» పెరిగిన నారుమడుల ఖర్చు
» గిట్టుబాటు ధరలపైనే ఆశలు
» ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

పెద్ద దోర్నాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మిరప సాగుకు రైతులు సిద్ధమయ్యారు. వాతావరణంలో మార్పులు కారణంగా కురిసిన మోస్తరు వానకు తమ భూములను బాగు చేసుకుంటున్నారు. పైగా ఖరీఫ్‌లోని ముఖ్యమైన పైర్లు మిరప, కంది, ఆముదాలు, మొక్కజొన్న తదితరాల సాగుకు పదును కావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఉదాసీన వైఖరితో ఉన్న రైతుల్లో కొంత ఉత్సాహం ఏర్పడింది. ఈ సీజన్‌కు అదను దాటి పోతుందని ఏదైతే అదైందని ముందు భూములను బీళ్లుగా ఉంచితే ప్రతి సారీ దున్నకం పనులు చేస్తూ అదనపు ఖర్చు వస్తుంది. ఏదొక పైరు వేస్తే అవే సేద్యం ఖర్చులతో పంటలు తీయొచ్చని సాగుకు ఉపక్రమించారు. పలువురు రైతులు కంది విత్తుతుండగా మరి కొందరు మొక్కజొన్న వేస్తున్నారు.


పొలంలో ఉన్న నారుమడులు

అధిక విస్తీర్ణంలో మిరప

ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం రైతులు వాణిజ్య పంటల్లో అధిక శాతం మంది మిరప సాగుకు ఆసక్తి కనబరుస్తారు. ఈ క్రమంలో ఎక్కువ మంది మిరప విత్తనాలు కొనుగోలు చేసి తమ భూముల్లోనే మడులు తయారు చేసుకుని స్ప్రింకర్ల ఏర్పాటుతో నార్లు పోసుకుంటున్నారు. దీంతో పొలం దగ్గరే నారు అందుబాటులో ఉంటుంది. ఖర్చు కూడా తగ్గుతుంది. మరి కొందరు విత్తనాలు కొనుగోలు చేసి షేడ్ నెట్లలో యజమానులతో మాట్లాడి మొక్కకు రూ.30 నుంచి 50పైసల చొప్పున నారు పోయిస్తున్నారు. తద్వారా కొంత ఖర్చయినా 45 రోజుల పాటు నారు ఆలనా పాలనా వారే చూస్తారు. ఇంకొందరు వర్షాలు బాగా కురిసి కాలం మిరపకు అనుకూలంగా ఉంటే అప్పుడే షేడ్ నెట్లలో కొనుగోలు చేసి నాటుకోవచ్చని భావనతో ఉన్నారు. ప్రధాన పొలాలను నాట్లు వేసుకునేందుకు సారవంతం చేసుకుంటున్నారు.

నారుమడుల ఖర్చు

ఎకరం మిరప సాగుకు పది గ్రాముల తూకంతో ఉన్న పది ప్యాకెట్లు అవసరమవుతాయి. రకాన్ని బట్టి ప్యాకెట్ ధర రూ.250 నుంచి రూ.420 వరకు పలుకుతున్నాయి. పది ప్యాకెట్లు రూ.2500 నుంచి రూ.4200 వరకు ఖర్చవుతుంది. ముగ్గురు కూలీలు రూ.300 చొప్పున రూ.900 మడులు తయారీకి రూ.1,000, స్ప్రింకర్లు రూ.1,000, ఎరువు, పురుగు మందుల ఖర్చు రూ.2,000 మొత్తంగా రూ.7,000 పైమాటే. షేడ్ నెట్లలో 15000 మొక్కలకు రూ.40పైసల చొప్పున రూ.6,000 చెల్లించాలి. విత్తనాల ఖర్చు రూ.4,000, పొలానికి రవాణా ఖర్చు రూ.1,000, మొత్తంగా రూ.11,000 ఈ విధానంలో 45 రోజులు సమయం దాటితే వాతావరణం ఎలా ఉన్నా నారు విధిగా తెచ్చుకోవాలసి ఉంటుంది.నేరుగా షేడ్ నెట్లలో కొనుగోలు చేస్తే మొక్క అప్పటి పరిస్థితుల ఆధారంగా ధరలు హెచ్చు తగ్గులుగా ఉంటాయి. రూ.80 పైసల నుంచి రూ.1.50 వరకు ఉండొచ్చు. రవాణా ఖర్చులతో ఎకరానికి రూ.15,000 పైగా అవసరమవుతాయి. అయితే విత్తనాల నాణ్యతలో కచ్చితత్వం ఉండదు.

గిట్టుబాటు ధరలతోనే యాతన

మిరప సాగుకు రైతులు ఎంతగా కష్టపడతారో అంతగా ఇష్టపడతారు. ఏడాది పాటు వివిధ తెగుళ్లు, నీటి ఎద్దడి, వాతావరణంలో మార్పులు వల్ల కలిగే ఇబ్బందులను ఎదుర్కొని పండించిన పంటకు గిట్టుబాటు ధర కీలకం. అదే లేకపోతే తీవ్రంగా నష్టపోతారు. గతేడాది ఇతే జరిగింది. మునుపెన్నడూ ఇలాంటి ధరలు చూడలేదని రైతులు వాపోతున్నారు. ఎకరం సాగు ఖర్చులో సగం కూడా రాకపోతే ఎన్నడు కోలుకోవాలి. కాయలు కోసిన కూలీలకు కూడా చెల్లించ లేని దుస్థితి నెలకొంది. చాలా మంది కాయలను ఆధరలకు అమ్మేందుకు ఇష్టం లేక శీతల గిడ్డంగులలో నిల్వ చేశారు. నేటికీ ధరలు పెరగలేదు. ఆ కాయలు అమ్మనూలేదు. తెచ్చిన అప్పుకు వడ్డీ పెరుగుతోంది. నిల్వ చేసిన కాయలకు బాడుగ చెల్లించలేక గగ్గోలు పెడుతున్నారు. పొలం చేసే కన్నా కూలీకి వెళ్లడం మంచిదని పలువురు రైతులు తమ భూములను ఈ ఏడాది కౌలుకు ఇస్తున్నారు. అయినా అడిగేవారు లేరు. నిరుడు ఎకరం కౌలు రూ.54వేలు చెల్లించిన వారు ఇప్పుడు రూ15వేలకు అడుగుతున్నారు. గతేడాది మార్చిలో ప్రభుత్వం క్వింటాకు రూ1,740 కలిపి ఇస్తామని ప్రకటించింది. ఏ ఒక్క రైతుకు చెల్లింపులు జరగలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదైనా మిరపకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కనీసం క్వింటా ధర రూ.18,000 ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు చెప్తున్నారు.

వాన కురిసింది.. సాగు మొదలైంది

పత్తి, కందిపై రైతుల ఆసక్తి

ఎర్రగొండపాలెం రూరల్ : ఖరీఫ్ సాగు ప్రారంభమై రోజులు గడుస్తున్న వరుణ దేవుడు మాత్రం కరుణించ లేదు. ఎట్టకేలకు శుక్ర, శని వారాలలో మండలం వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. రైతులకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. సాగు చేసుకునేందుకు, సాగు చేసిన పొలాలకు ఉపకరించింది. దీంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలోని గోళ్లవిడిపి, అయ్యంబొట్లపల్లి, గురిజేపల్లి, వీరభద్రాపురం, తమ్మడపల్లి, వాదంపల్లి, గంగుపల్లి, మిల్లంపల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో రైతులు దుక్కి దున్ని పత్తి, కంది తదితర పంటలు సాగు చేస్తున్నారు. గోళ్లవిడిపి గ్రామానికి చెందిన పొలేబోయిన విష్ణువర్ధన్ తన 5 ఎకరాల పొలాన్ని ఎద్దులతో దుక్కి దున్ని పత్తి విత్తనాలు విత్తున్నట్లు ఆదివారం తెలిపారు. పత్తి, మిరప, మొక్కజొన్న, బొప్పాయి, అరటి పంటలకు ఎంతో మేలు చేసిందని రైతులు చెప్తున్నారు.


గోళ్లవిడిపిలో ఎడ్లతో పొలం దున్నుతున్న రైతు

పంటల సాగుకు సిద్ధపడుతున్న రైతులు

రాచర్ల : పంటల సాగుకు రైతులు సిద్ధపడతున్నారు. వరి, మిరప, కంది పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. మే చివర్లో జూన్ ప్రారంభంలో కురవాల్సిన వర్షాలు సకాలంలో కురవకపోవడంతో అదును తప్పిపోవడంతో రైతులు సకాలంలో పంటలు వేయలేదు. వర్షాలు లేక దిగాలు పడి ఉన్న రైతులకు రెండు రోజులుగా కొద్దిపాటి వర్షాలు కురవడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. వరి, మిరప, టమాటా తదితర పంటలు సాగుకు పరిస్థితులు అనుకూలించడంతో వాటిపై రైతులు మొగ్గుచూపుతున్నారు.


టమాటా మొక్కలను నాటుతున్న కూలీలు

సమ్మెతో కదలని చెత్త


గిద్దలూరులోని షాదీఖానా రోడ్డులో పేరుకుపోయిన చెత్తా చెదారం

మున్సిపల్ కార్మికుల ఆందోళనతో ఎక్కడి చెత్త అక్కడే

గిద్దలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : డిమాండ్ల సాధన కోసం మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. గత 4 రోజులుగా పారిశుధ్య సిబ్బంది సమ్మెలోకి వెళ్లగా గిద్దలూరు మున్సిపాలిటీలోని వీధులన్నీ చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. కొన్ని వీధుల మొదట్లో చెత్తాచెదారం రోడ్డంతా ఆక్రమించి నడిచేందుకు కూడా వీలుకాని పరిస్థితి, నడిస్తే కూడా ముక్కుమూసుకుని కూడా నడవలేని పరిస్థితి కనిపిస్తున్నది. గిద్దలూరు మున్సిపాలిటీలో 6 మంది పర్మినెంట్, 57 మంది ఆబ్కాస్ కార్మికులు కొవిడ్ సమయంలో తీసుకున్న 25 మంది ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారు. 57 మంది ఆబ్కాస్ కార్మికులందరూ గత 4 రోజులుగా సమ్మెలో ఉన్నారు. దాంతో ప్రధాన వీధుల్లో మాత్రమే 6 మంది పర్మినెంట్, 25 కొవిడ్ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు. ఇళ్ల వద్దకు వచ్చే 35 చెత్త రిక్షాలు, పుష్ కాట్‌లు మూలనపడ్డాయి. దాంతో మున్సిపల్ అధికారులు చెత్తను చేరవేసే 3 ట్రాక్టర్లను నేరుగా ఇళ్ల వద్దకు పంపిస్తూ అరకొర చెత్తను సేకరిస్తున్నారు. ట్రాక్టర్లు వెళ్లలేని చిన్న చిన్న వీధుల్లోని ప్రజలు చెత్తాచెదారాన్ని ఇళ్ల బయట, కాలువల్లో వేయా ల్సిన పరిస్థితి నెలకొంటున్నది. నల్లబండ బజారు, రాచర్లగేటు అవతల, శివారు వీధులకు ట్రాక్టర్లు రోజు మార్చి రోజు పంపుతున్నారు. షాదీఖానా రోడ్డు, శర్మవీధి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా వీధుల మొదళ్లలో ఆప్రాంత ప్రజ లు తమ ఇళ్లలోని చెత్తాచెదారాన్ని రోడ్డుపై పడవేశారు. గత 4 నెలలుగా వాటిని డంపింగ్ యార్డుకు తీసుకుని వెళ్లకపోవడంతో ముక్కుమూసుకుని కూ డా ఆవీధుల్లోకి వెళ్ళడం ఇబ్బందిగా త యారైంది. మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసి రోడ్లపై నిండిపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి వ్యాధుల నుంచి ప్రజలను దూరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమ్మెతో తాగునీటికి ఇబ్బంది


మార్కాపురంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు (ఫైల్)

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల చేస్తున్న సమ్మె ఆదివారం 8వ రోజుకు చేరింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ జలాల సరఫరా లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు మరింత ఎక్కువ అయ్యా యి. సమ్మె కారణంగా సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. నాలుగురోజుల కిందట పూలసుబ్బయ్య కాలనీవాసులు నీటి కోసం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. దీంతో అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. పట్టణంలో పది రోజులుగా సాగర్ జలాల సరఫరా నిలిచిపోయింది. మార్కాపురం మున్సిపాలిటీలో 183 మంది పారిశుధ్య కార్మికులు ఆప్కాస్ కింద పనిచేస్తున్నారు. మరో 14 మంది పర్మినెంట్ కార్మికులు మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో 72 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉండగా, 60 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. కార్మికులు పైప్‌లైన్‌ల మరమ్మతులు, విద్యుత్ వీధీ దీపాల నిర్వహణ, బోర్ల నిర్వహణ, సాగర్ జాలాల సరఫరాలో పనులు చేస్తుంటారు. సమ్మె కారణంగా వారు వాటి నిర్వహణ మానుకోవడంతో ప్రజల ఇబ్బందులకు గురవుతున్నారు. డీప్ బోర్ల నిర్వాహణ ఆయా ప్రాంతాలలో స్థానికులే చూసుకుంటున్నారు. దూపాడు సమ్మర్ స్టోరేజీ వద్ద పనిచేసే కార్మికులు తక్కువ ఉండడంతో సాగర్ జలాల సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలో అధికారులు సమ్మెతో ఇబ్బందులు కలుగకుండా కాలువలు తీయించడం, చెత్త సేకరణ, ఇతర పనులు సమ్మెలో లేని కార్మికులతో చేస్తున్నారు.


గిద్దలూరులోని శర్మ వీధిలో ఉన్న చెత్త


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

హామీలను అమలు చేసిన ఘనత చంద్రబాబుదే

రాచర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : హామీలిచ్చి వాటిని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆకవీడు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆయన ఇటంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు విరించారు. అనంతరం వారికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల వేళ చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రకటించిన మేరకు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అశోక్‌రెడ్డి తెలిపారు. పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలయ్యాయన్నారు. అన్నదాత సుఖీభవ కొద్దిరోజుల్లో అందిస్తామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతిని రూ.3వేలు ఈ ఏడాదిలోనే ఇస్తామన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ముందుకు వెళ్తున్నామని అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై హర్షం


మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు

గిద్దలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులుబాసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి పొట్టిశ్రీరాములు సేవలకు గుర్తింపుగా అమరావతిలో స్మృతివనం ఏర్పాటు కోసం స్థలం కేటాయించడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు సూరె నాగేశ్వరరావు మాట్లాడుతూ అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్టుకు 6.80 ఎకరాలు స్థలం కేటాయించి, అందులో 58 అడుగుల ఎత్తులో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్ర భుత్వం ముందుకు రావడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. స్థలం కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, కృషి చేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్‌కు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు గర్రె లక్ష్మీనారాయణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గర్రె పుల్లయ్య పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం

మార్కాపురం వన్‌టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థల సేవలకు దాతల సహకారం ఎంతో అవసరమని మానవతా శాఖ సభ్యులు అన్నారు. స్థానిక శాఖ కార్యాలయంలో తిప్పిశెట్టి రంజిత్ కుమార్ జయంతి సందర్భంగా ఆయన కుమార్తెలు జోహిత, రితిక రూ.లక్ష విలువ జేసే 2 ఆక్సిజన్ మిషన్లు, వీల్ చైర్లను సంస్థకు ఆదివారం అందించారు. వీటిని రోగులకు ఉచితంగా ఇస్తామని, ఇంట్లో ఉండి చికిత్స తీసుకుంటున్న రోగులకు ఆక్సిజన్ అందక ఇబ్బందులు పడుతున్నవారు తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో గుంటక చెన్నారెడ్డి, పీవీ కృష్ణారావు, ఆర్‌కేజే నరసింహం, బండి చిన్న, గుంటక సుబ్బారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.


ఆక్సిజన్ మిషన్‌లు అందజేస్తున్న దాతలు

శాకంబరిగా పోలేరమ్మ



మార్కాపురం వన్‌టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం శాకంబరి అలంకారం ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించారు. అర్చకులు కూరగాయాలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

పొదిలిలో..



పొదిలి : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటా ఆషాఢమాసంలో అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనం కలిపిస్తారు. అందులో భాగంగా అమ్మవారి దర్శనం కల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో న్యాయాధికారి కిశోర్ కుమార్

కరాటేతో ఆత్మరక్షణ

మార్కాపురం వన్‌టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కరాటేతో ఆత్మరక్షణ లభిస్తుందని జూనియర్ సివిల్ న్యాయాధికారి కిశోర్ కుమార్ అన్నారు. పూలసుబ్బయ్య భవన్‌లో ఎమ్ఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు ఎం.శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

తర్లుపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్ అన్నారు. మండలంలోని జగన్నాథపురంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ ప్రధాన కార్యదర్శి మాబూవలి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కుంచేపల్లిలో చెక్కులను పంపిణీ చేస్తున్న వసంతలక్ష్మి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పొదిలి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ రకాలుగా అనారోగ్యాలతో వైద్యం చేయించుకున్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సతీమణి కందుల వసంతలక్ష్మి ఆదివారం పంపిణీ చేశారు. మండలంలో మొత్తం ఏడుగురుకి కుంచేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరికీ సీఎం చంద్రబాబు అండగా ఉంటారన్నారు. ఎవరికి కష్టమొచ్చినా ఆదుకుంటారని భరోసా ఇచ్చారు. ముందుగా సర్పంచ్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల కాంతమ్మ, అనిల్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. లబ్ధిదారుడైన పేరం చినకోటిరెడ్డికి రూ.3లక్షల చెక్కును వసంతలక్ష్మి, కాంతమ్మ అందజేశారు.

కార్మికుల నిరసన

గిద్దలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం గత 5 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చిరు ఉద్యోగులమైన తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, మిగతా ప్రభుత్వ ఉద్యోగుల వలే రిటైర్డ్‌మెంట్ వయస్సును 62కు పెంచాలని, జిఓ నెంబరు 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మిక సంఘం ప్రతినిధులు మురళి, రంగయ్య, చంటయ్య, పాపయ్య పాల్గొన్నారు.

పొదిలి : పారిశుధ్య కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల సమ్మె నాలుగో రోజున కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.సుబ్బయ్య, నరసింహం, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, సుబ్బయ్య, నాగేంద్రం, సుబ్బులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 8వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన దీక్షా శిబిరం నిర్వహించారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, రమణ, షబ్బీర్, కరిముల్లా, కనకయ్య పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

గిద్దలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రిటైర్డ్ హోంలో 21వ తేదీ సోమవారం ఉదయం 10గంటలకు నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇహెచ్ఎస్, ఆధార్ కార్డులను ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు శిబిరానికి తెచ్చుకోవాలని, పరీక్షించి అవసరమైతే శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతులు అందజేత

గిద్దలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు దాతలు బహుమతులు అందచేశారు. వ్యాసరచన పోటీల జూనియర్స్ విభాగంలో దివ్య, స్వరూప్, జశ్విత, సీనియర్స్ విభాగంలో రాజశేఖర్, సాయిపత్రాప్, భాశ్విత విజేతలుగా కాగా, వారికి నంద్యాల కార్తికేయ అనే దాత బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్ పాల్గొన్నారు.

నీటి కుంటలా గాయత్రి సినిమా హాల్ రోడ్డు


గాయత్రి సినిమా హాల్ రోడ్డుపై నిలిచి ఉన్న నీరు

ఎర్రగొండపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గాయత్రి సినిమా హాల్‌కు వెళ్లే రోడ్డులో మూలమలుపు వద్ద వాన నీరు నిలిచి ఉంది. దీంతో స్కూల్ పిల్లలు, వృద్ధులు నడవలేక ఇబ్బందులకు గురవుతున్నారు. వానలు కురిసిన ప్రతిసారీ ఈ రోడ్డులో నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో నీరు నిలిచి ఉండగా ఎర్రగొండపాలెం పుల్లలచెరువు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు కింద పైపులను వేశారు. ప్రస్తుతం ఆ పైపు లైన్లకు అడ్డంగా మట్టి, చెత్త పేరుకుపోవడంతో పైపులో నుంచి నీరు వెళ్లకపోవడంతో రోడ్డుపై వరద నీరు నిలిచి ఉండిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరానగర్‌లో ఆదివారం కురిసన వర్షానికి వీధి రోడ్లు జలమయమయ్యాయి. రోజులతరబడి నీరు నిలిచిఉంటుందని స్థానికులు చెప్తున్నారు. పైపు లైన్లకు అడ్డంకులు తొలగించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ల తరలింపును అడ్డుకున్న ఎమ్మెల్యే

ఎర్రగొండపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గురిజేపల్లి నుంచి ఎర్రగొండపాలెం వరకు ఉన్న పైపులను తొలగించి, అక్రమంగా లారీలో తరలిస్తుండగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగొండపాలెం చుట్టుపక్కల గ్రామాల్లో తాగునీటి బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోయి ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. 90 సంవత్సరాల పాటు నాణ్యతగా ఉండే విధంగా రూ.7కోట్లతో డీ-1 కే-7 రకం పైపులతో జాతీయ రహదారి కాంట్రాక్టర్ ఈ పైపులైన్‌ను నిర్మించారని తెలిపారు. దీనిద్వారా దూపాడు రక్షిత తాగునీటి పథకం నుంచి ఎర్రగొండపాలెం పరిసర గ్రామాలకు సాగర్ జలాలు సరఫరా చేయకుండా, పైపు లైన్‌ను తొలగించి ఈ పైపులు చందవరం తాగునీటి పథకానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ఎలా వినియోగిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు వివరణిస్తూ చందవరం తాగునీటి పథకం నుంచి గ్రామాలకు పైపులైన్ వేయడానికి పైపులు అవసరమయ్యాయి. దీంతో వైపాలెం జాతీయ రోడ్డు పక్కన ఉన్న వినియోగంలో లేని రెండో పైపులైను పైపులను అక్కడకు తరలించేందుకు ప్రభుత్వ అనుమతి తీసుకున్నాం. ఆ మేరకు తరలింపు చేస్తున్నట్లు తెలిపారు.


లారీని అడ్డుకున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్, నాయకులు

'జగన్ కనుసన్నల్లోనే అక్రమాలు'

దర్శి, జూలై 20(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ కేసులో మాజీ సీఎం వైఎస్ జగన్ జైలుకు వెళ్లటం ఖాయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకిలీ మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యాలను హరించి వేలకోట్ల రూపాయల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు.

ఇప్పటికే మిధున్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కసిరెడ్డి తదితరులంతా జైలుకు వెళ్లారని చెప్పారు. వీరందరూ జగన్ కనుసన్నల్లోనే అక్రమాలకు పాల్పడ్డారనే విషయం బహిరంగ సత్యమన్నారు. వైసీపీ నాయకుల ప్రవర్తన అలీబాబా 40 దొంగల వలే ఉందన్నారు. ప్రజల సొమ్మును దోచుకున్న నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెరుగవుతున్న రవాణా సౌకర్యం

దర్శి, జూలై 20(ఆంధ్రజ్యోతి): పొదిలి డిపో నుంచి విజయవాడకు వెళ్లేందుకు ఎనిమిది కొత్త బస్సులను సోమవారం నుంచి నడుపుతున్నారు. దర్శిలో ఆర్టీసీ డిపో లేకపోవటంతో బస్సుల కొరత తీవ్రమైన విషయాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పలు పర్యాయాలు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సూచనల మేరకు పొదిలి డిపోకు మంజూరైన కొత్త బస్సుల్లో ఎనిమిది బస్సులను దర్శి, అద్దంకి, గుంటూరు మీదుగా విజయవాడకు సోమవారం నుంచి నడుపుతారు. ఈ బస్సులు అందుబాటులోకి వస్తే ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతుంది.

ఘర్షణలో ఒకరికి గాయాలు

ముండ్లమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన మందలపు భారతి, లక్ష్మి అనే తోడికోటల్లు ఆస్తి వివాదంలో శనివారం సాయంత్రం ఘర్షణపడ్డారు. భారతికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. ఆమె ఇచ్చిన స్టేట్‌మెంట్ మేరకు ఆదివారం ముండ్లమూరు ఎస్ఐ కె.కమలాకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి

ఒంగోలు విద్య, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. బదిలీలు ముగిసి నెల రోజులు దాటిన కొత్త పోస్టులకు పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. జీతాలు చెల్లింపునకు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ బదిలీ అయిన టీచర్లకు రిలీవర్ రాని కారణంగా వారు పాత స్థానాల్లోనే పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎస్సీ కొత్త పోస్టులు ఇచ్చినా ఇంకా సుమారు 500 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితి ఉందని చెప్పారు. ఖాళీ పోస్టుల్లో అర్హులైన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించి విద్యార్థులకు విద్యను అందించాలని కోరారు. పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్‌ను ప్రకటించాలని, బకాయిలు ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎస్.రవి, ఉమామహేశ్వరి, చిన్నస్వామి, ఎం.సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

పామూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడవాడ గ్రామా నికి చెందిన నీటి సంఘం చైర్మన్, టీడీపీ నాయకుడు యల్లంకి శివయ్య (65) ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కు మార్తెలు ఉన్నారు. శివయ్య అకాల మృతి పట్ల సర్పంచ్ దాసరి మాల కొండయ్య, రత్తయ్య, డి.కోటిలింగం, మల్లికార్జున, రమణయ్య సంతాపం తెలిపారు.

కనిగిరి.. కంపు

- కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన చెత్త
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రత్యామ్నాయమార్గాలు చూడని అధికారులు


గ్రంథాలయం వద్ద పేరుకుపోయిన చెత్త

కనిగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెతో కనిగిరి పట్టణంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. వీధులన్నీ దుర్వాసనతో కంపు కొడుతున్నాయి. పట్టణంలో 20 వార్డుల్లో ప్రతిరోజూ చెత్త సేకరణ రెండు లారీలకు చేరుకుంటుంది. ఇంకా వివిధ వ్యాపార షాపుల నుంచి సేకరించిన చెత్త ఇంచుమించు మూడు ట్రాక్టర్ల మేర ఉంటుంది. అలాగే, నగరంలోని వివిధ వీధుల్లోని సైడు కాల్వల్లోని మురుగు, తడి చెత్తను కూడ సేకరించి ఏఎంసీ మార్కెట్ యార్డ్ సమీపంలోని చెరువు ప్రాంతంలో డంపింగ్‌కు చేరుస్తారు.

మున్సిపాల్టీ పరిధిలో ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు 136 మంది ఉన్నారు. వారిలో రెగ్యులర్ కింద ముగ్గురు, ఆప్కాస్ పద్ధతిలో 106 మంది పనిచేస్తున్నారు. అదనంగా పది మంది సిబ్బందిని తీసుకోగా, కొవిడ్ సమయంలో మరో 17 మందిని తీసుకున్నారు. వీరిలో ఏఐటీయూసీకి అనుబంధంగా 67 మంది కార్మికులు, సీఐటీయూకి అనుబంధంగా 66 మంది కార్మికులు ఉన్నారు. సీఐటీయూకి అనుబంధంగా ఉన్న కార్మికులు మాత్రమే సమ్మెలో పాల్గొంటు న్నారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మికుల ఆగస్టు 2 నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు.


గార్లపేట రోడ్డులో ఉన్న చెత్తకుప్ప నుంచి రోడ్లపైకి చేరిన చెత్తాచెదారం

ప్రత్యామ్నాయం పట్టని అధికారులు

ఏఐటీయూసీ అను బంధంగా ఉన్న 67 మంది కార్మికులు విధుల్లో ఉన్న ప్పటికీ క్షేత్రస్థాయిలో కని పించడంలేదు. ఎక్కడ చెత్త కుప్పలు అక్కడే ఉన్నాయి. ఇళ్లల్లోని చెత్తను సేకరించేం దుకు సిబ్బంది రాకపోవటం తో గృహ యజమానులు నేరుగా సమీప చెత్తకుప్పల వద్ద వేస్తున్నారు. కొన్నిచోట్ల రోడ్ల వెంట, మురుగు కాల్వలల్లో పడ వేస్తున్నారు. రెండురోజుల క్రితం కురిసిన వర్షాలతో మురుగు వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు పట్టణ పరిశుభ్రతకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

అదనపు సిబ్బందిని వినియోగిస్తాం

కనిగిరి నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య సిబ్బంది 75 మంది విధులు నిర్వర్తిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. సమ్మె కారణంగా వారు విధులు నిర్వహించటం లేదు. కొవిడ్ సమయంలో తీసుకు్న సిబ్బంది 17మందితో పాటు మరో 8 మందిని అదనంగా తీసుకుని రాత్రి వేళల్లో పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. వారు విధు ల్లో ఉన్నప్పుడు సీఐటీయూ నాయకులు వారిని పంపించి ట్రాక్టర్‌లో ఉన్న చెత్తను రోడ్డుపై పారవే యించారు. ప్రజల ఇబ్బందులను కూడా దృష్టిలో ఉం చుకోవాలని చెప్పినా వినలేదు. అదనపు సిబ్బంది చేత పారిశుధ్య పనులు చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఇబ్బందులను గమనించి సహ కరించాలని ఆయన కోరారు.

చంద్రబాబు సారథ్యంలో

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూలై 20(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. తొలి అడుగు ఏడాది సుపరి పాలన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర స్వగ్రామమైన హెచ్‌ఎంపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోని ఆదివారం పర్యటించారు. తన నివాసం నుంచి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది సుపరిపాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని సేకరించారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అ మలు, కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. కనిగిరిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని సేకరించారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తె లుసుకుని నమోదు చేసుకున్నారు. ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అం దించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా టీడీపీ గ్రామ అధ్యక్షుడు, మండల అధ్యక్షుల దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని హను


తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

మంతునిపాడులో నిర్మాణంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్ఐ మాధవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, కుందురు నారాయణరెడ్డి, దశరథ, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- అడుగడుగునా గోతులు
- కమ్మేసిన చిల్లచెట్లు
- పొంచి ఉన్న ప్రమాదాలు
- వాహన చోదకుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా పెదఉల్లగల్లు - వేముల రహదారి

ముండ్లమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు రహదారులను చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెదఉల్లగల్లు - వేముల రహదారి అడుగడుగునా గోతులమయమైంది. వాహన చోదకులు ఆ రహదారిపై ప్రయాణం అంటేనే హడలిపోతున్నారు. పట్టించు కోవాల్సిన పంచాయతీ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పెద ఉల్లగల్లు నుంచి వేముల రహదారి 12 కిలో మీటర్లు ఉంటుంది. ఈమార్గంలో పెదఉల్లగల్లు, రాజగోపాలరెడ్డి నగర్, కమ్మవారిపాలెం గ్రామాల మధ్య రహదారి అధ్వానస్థితికి చేరింది. మోకాలిలోతు గుంతలుపడ్డాయి. దీంతో వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది రాజగోపాలరెడ్డినగర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు గోతుల్లో పడి మృతి చెందాడు.

గత వైసీపీ ప్రభుత్వంలో అతిముఖ్యమైన ఈ రహదారిపై తట్ట మట్టిపోసిన పాపాన పోలేదు. ఈ మార్గంలో 15 గ్రామాల ప్రజలు నిత్యం దర్శి, ముండ్లమూరుకు ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈదర, కొమ్మవరం, అయోధ్య నగరం, బొప్పూడివారిపాలెం, రాజగోపాలరెడ్డి నగర్, కమ్మవారిపాలెంతో పాటు మరికొన్ని గ్రామాల ప్రజలు ప్రయాణం సాగిస్తున్నారు. రాత్రుల సమయాల్లో ఐతే పలు గ్రామాల ప్రజలతో పాటు కొత్తగా వెళ్ళే వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికితోడు చిల్లచెట్లు దట్టంగా పెరిగి పోయి రహదారిని కమ్మేశాయి. ఫలితంగా, ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


చిల్లచెట్లు కమ్మేసిన వేముల - ఉల్లగల్లు రహదారి

ముండ్లమూరులో భారీ వర్షం


ముండ్లమూరులో కురుస్తున్న భారీ వర్షం

ముండ్లమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముండ్లమూరుతో పాటు పసుపుగల్లు, పెదఉల్లగల్లు, పులిపాడు, కెల్లంపల్లి, సింగనపాలెం, వేముల, ఈదర, పూరిమెట్ల, భీమవరం, తమ్మలూరు, నాయుడుపాలెం, మారెళ్ళ, జమ్మల మడక, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, పోలవరం, శంకరాపురం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం రైతులకు ఎంతో మేలు చేకూ ర్చింది. ఇటీవల కురిసిన వర్షానికి మొక్కజొన్న, సజ్జ సాగు చేస్తున్నారు. ఆ పైర్లకు ఈ వర్షం మేలు చేకూరింది. మరికొంతమంది రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

కురిచేడులో..

కురిచేడు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కురిచేడులో ఆదివారం సాయంత్రం వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా ఉక్కపోతకు ప్రజలు విలవిల్లాడారు. సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. నాన్పుడు వాన కావడంతో చేలల్లో పొలాలు పదు నెక్కి విత్తనాలు విత్తడానికి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


పోలవరంలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు

ముండ్లమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని పోలవరం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలకులు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. ఆర్థికంగా లోటు ఉన్నా కూడా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సుంకర రాఘవరెడ్డి, కొర్రపాటి విజయలక్ష్మి, శ్రీనివాసరావు, తూమాటి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పామూరు: అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని టీడపీ పట్టణ ప్రధానకార్యదర్శి నొస్సం నాగేంద్రచారి అన్నారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 265 బూత్ పరిధిలో ఆదివారం సుపరిపాలనలో తొలి ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాలకు చెందిన కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ పంపిణీచేశారు. అలాగే, 268 బూత్ పరిధిలో పట్టణ మాజీ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక డీవీ పాలెం గ్రామంలో 272 బూత్ పరిధిలో ఇన్‌చార్జ్ చిన్న హజరత్ ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు.

శాకంబరిగా పోలేరమ్మ



మార్కాపురం వన్‌టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులోని పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం శాకాంబరి అలంకారం ఆషాఢ మాసం సంద ర్భంగా నిర్వహించారు. అర్చకులు కూరగాయాలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవారి మూలవిరాట్‌ను అలంక రించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో మాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

స్థలం కేటాయింపుపై హర్షం

పామూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులుబాసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన అమరజీవి పొట్టిశ్రీరాములు సేవలకు గుర్తింపుగా అమరావతిలో స్మృతివనం ఏర్పాటు కోసం స్థలం కేటాయించడం పట్ల ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పందిటి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆదివారం స్థానిక వాసవీమాత దేవస్థానం వద్ద శ్రీరాములు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పందిటి మాట్లాడుతూ అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు ట్రస్టుకు 6.80 ఎకరాలు స్థలం కేటాయించి, అందులో 58 అడుగుల ఎత్తులో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్ర భుత్వం ముం దుకు రావడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. స్థలం కేటా యించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మంత్రి టీజే భరత్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో వాసవీ దేవస్థాన చైర్మన్ కోట నరసింహారావు, రాజేష్, ఎస్ కృష్ణయ్య, ఆర్.సాయి, గణే ష్ హరి, పి.నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


భైరవకోనలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భైరవకోనలో పర్యాటకుల సందడి

సీఎస్‌పురం(పామూరు), జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన శ్రీభైరవకోన క్షేత్రంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. నీటి కొలనులో సందడిచేశారు. అనంతరం శ్రీముఖ దుర్గాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా పామూరు మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన కేతు వెంకటేశ్వరరెడ్డి ఆదిలక్ష్మ దంపతుల కుమారుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థాన అభివృద్ధికి రూ.10,1116 విరాళాన్ని ఈవో వంశీకృష్ణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బైరెడ్డి జయరామిరెడ్డి, శ్యాంసుందరాజు, విబ్ర హ్మానందరెడ్డి, చెరుకుపల్లి వెంకటరెడ్డి, సీహెచ్ జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


స్వామివార్లకు నైవేద్యం తెస్తున్న భక్తులు

ఘనంగా ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 20(ఆంధ్ర జ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనా రాయణస్వామి దేవ స్థానంలో భక్తులు ఆదివారం పూజలను ఘనంగా నిర్వ హించారు. ముందుగా దేవ స్థానంలో స్వామి వారి మూల విరాట్ వద్ద సహస్ర కుంకు మార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం గోశాలలోని గోమా తలకు పసుపు కుంకుమార్చన పూజలు నిర్వ హించారు. ఆల య గోపురం వద్ద నుంచి మేళతాళాలతో ఆలయ గాలి గోపురం వద్ద నుంచి ప్రదక్షిణలు చేస్తూ మహానైవేద్యాన్ని స్వామివార్లకు సమర్పించి భక్తులకు అందజేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈవో నరసింహబాబు, తదితరులు పా ల్గొన్నారు.


పీసీపల్లి: మర్రికుంటపల్లిలో గ్రామోత్సవంలో తరలిపోతున్న పీర్లు


జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

పీసీపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి పీర్ల సరగత్తుల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మర్రికుంటపల్లి గ్రామంలోని పీర్ల చావిడిలో పీర్లను అలంకరించి బయటకు తీసుకువచ్చారు. చావిడి ఎదురుగా ఉన్న అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. మర్రికుంటపల్లి లో గ్రామోత్సవం ముగిసిన అనంతరం మేళతాళాలతో పీర్లు పెద్దన్నపల్లి, తలకొండపాడు, చిరుకూరివారిపల్లి గ్రామాలకు చేరుకున్నాయి. ఆయా గ్రామాల్లో కనులపండువగా గ్రామో త్సవం జరిగింది. గ్రామోత్సవం అనంతరం ఆదివారం పీర్లు జల్దికి చేరుకున్నాయి.



బాపట్ల మండలం వెదుళ్ళపల్లిలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వేయటంతో ఏర్పడిన గుంతలు

ఆగని గ్రానైట్ దందా

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో యథేచ్ఛగా గ్రానైట్ దందా సాగింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ దందాపై ఎడతెగని పోరాటమే చేసింది. ప్రభుత్వం మారి అధికారం టీడీపీ చేతికి చిక్కింది. కానీ ఈ గ్రానైట్ దందాలో మాత్రం మార్పు రాలేదు. పైగా ఇది మరో స్థాయికి చేరుకుంది. అప్పుడు పెదబొబ్బలు పెట్టిన నేతల అనుయాయులే ఇప్పుడు సూత్రధారులయ్యారు. ప్రైవేట్ సైన్యం కూడా సేమ్ టూ సేమ్.

- జీరో బిల్లులతో అక్రమ రవాణా
- నాడు ఆందోళనలు.. నేడు నేతల అండ
- గత ప్రభుత్వ తరహాలోనే అడ్డగోలు దోపిడీ
- వాటాల్లో తేడాలు.. ఆధిపత్య పోరుతోనే లారీల పట్టివేత

(బాపట్ల, మార్టూరు, దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

గ్రానైట్‌ను అడ్డం పెట్టుకుని అడగోలుగా ఎంత సంపాదించ వచ్చో అప్పటి నేతలు దారి చూపగా, దానిని అందిపుచ్చుకున్న ప్రస్తుత నేతలు ఇప్పుడూ అదేమార్గంలో దూసుకెళుతున్నారు. మైనింగ్, రెవెన్యూతో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పాత్ర ఈ అడ్డగోలు దందాలో ఉండగా, కీలకపాత్ర మాత్రం అధికార పార్టీ నేతల అనుచరులదే అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

బాపట్ల జిల్లాలోని మార్టూరు, సంతమాగులూరు, బల్లికురవ మండలాల నుంచి గ్రానైట్ పలకలతో పాటు ముడిసరుకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. బాపట్ల జిల్లా నుంచి పల్నాడు జిల్లా మీదగా తెలంగాణలోకి ప్రవేశించాల్సి ఉంది. ఈ క్రమంలో మైనింగ్ సీనరేజ్‌కు సంబంధించి ఓ ప్రైవేటు ఏజెన్సీ వసూళ్ల టెండర్ గత ప్రభుత్వంలోనే దక్కించుకుంది. అనధికారిక రవాణా విషయంలో ఈ సంస్థ ఇచ్చే టోకెన్ కూడా సరిహద్దుల దగ్గర పనిచేస్తున్నాయని సమాచారం. ఇది కాకుండా జీఎస్టీ కూడా గ్రానైట్ వ్యాపారులు చెల్లించాలి. ఒక్కో లారీకి సుమారు రూ.70,000 నుంచి లక్ష వరకు వివిధ రూపాలలో ప్రభుత్వానికి ఆదాయం లభించే అవకాశం ఉంది. కానీ నిబంధనలకు పాతరేసి లారీకి రూ.35,000 నుంచి రూ.45,000 కప్పం చెల్లిస్తే చాలు దర్జాగా సరిహద్దులు దాటిస్తున్నారు. అలా వసూలు చేసిన మొత్తాల్లోనే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి కొంత, వ్యవస్థలకు కొంత, సింహభాగం మాత్రం అధికార పార్టీ నేతల అనుచరగణానికే. ఈ అడ్డగోలు దందాలకు ఆపితే ప్రభుత్వ ఖజానాకు నెలకు అక్షరాల పది కోట్లు ఆదాయం సమకూరుతుంది.



లారీల్లో ఉన్న గ్రానైట్ రాళ్ళు



గ్రానైట్ అక్రమ రవాణా చేస్తూ మార్టూరులో పట్టుబడిన లారీలు (ఫైల్ ఫొటో)

ఆధిపత్యపోరుతోనే..

పన్నులు చెల్లించకుండా మార్టూరు ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న 11 గ్రానైట్ లారీలను జూన్ 24న పల్నాడు జిల్లాలోని సరిహద్దుల వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. శనివారం పల్నాడు జిల్లా తంగెడ వద్ద మరో 14 లారీలను పట్టుకున్నారు. లారీలను పట్టుకున్న అధికారులపై ప్రైవేటు సైన్యం వాగ్వాదానికి దిగిందనే ప్రచారం ఉంది. ఈ రెండు ఉదంతాలకు సంబంధించే జరిమానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.60 లక్షలకు పైగా జమైంది. దీనిని బట్టి గ్రానైట్ రవాణాలో మాఫియా పాత్ర లేకపోతే ప్రభుత్వ ఖజానాకు కాసుల గలగలే. ఈ మొక్కుబడి పట్టివేతలు ఆధిపత్య పోరులో భాగంగానే అనే ప్రచారం జోరుగా నడుస్తోంది. వాటాల పంపకాలలో నేతల అనుచరుల మధ్య వచ్చిన తేడాల్లో భాగంగానే తమ పరిధిలో ఉన్న అధికారులను ప్రయోగించి దారికి తెచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని గ్రానైట్ వ్యాపారులు చెబుతున్నారు.

కాదేదీ తవ్వకానికి అనర్హం!

- బాపట్లలో అడ్డగోలుగా ఇసుక, మట్టి తవ్వకాలు
- మెరక సాకుతో సాగు భూములనూ వదలని వైనం

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన బాపట్ల నియోజకవర్గంలో ఇసుక, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గోరంత అనుమతితో కొండంత మట్టి తవ్వి తరలిస్తున్నారు. మెరకలు తీస్తున్నామనే సాకుతో.. ప్రొక్లెయినర్లతో వ్యవసాయ భూములను సైతం అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోతున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలు పెద్దఎత్తున వస్తున్నాయి. పొలాల నుంచి రైతులు మరమ్మతుల నిమిత్తం.. ఒక ట్రాక్టర్ మట్టి తీసుకొస్తే నేరంగా పరిగణించే అధికారులు.. ఈ విధంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నా తమకేమి తెలియదన్నట్లు చోద్యం చూస్తున్నారు. బాపట్ల మండలంలోని వెదుళ్ళపల్లి, ధరివాదకొత్తపాలెం, స్టూవర్టుపురం, బేతపూడి పరిసర ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు పరిపాటిగా మారాయి. కొంతమంది ఫిల్లింగ్ శాండ్ విక్రయిస్తుండగా.. మరికొందరు కట్టుబడి ఇసుక విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఈ అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. వందలాది ఎకరాల లేఅవుట్‌లు మెరక చేయడానికి కాంట్రాక్ట్ పద్ధతిన ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. కర్లపాలెం మండలంలోని బుద్దాం, యాజలి గ్రామాల్లో నల్లమట్టి, పేరలి, తుమ్మలపల్లి పరిసర ప్రాంతాల్లో బుసక ఇసుక తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ఈ ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. పిట్టలవానిపాలెం మండలం గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని దివాన్‌తోట ఎస్టీ కాలనీ సమీపంలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం వందలాది ట్రాక్టర్‌ల బుసక ఇసుక తరలిస్తున్నారు. ఈ తవ్వకాలపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే పొలాలు కాస్త చెరువులుగా మారే ప్రమాదం ఉంది.



కర్లపాలెంలో తవ్విన మట్టిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

బర్లీ కొనుగోళ్లు.. సెప్టెంబరు వరకు

రెండు నెలలు అందుబాటులో కేంద్రాలు

అధికారులకు సమాచారం ఇచ్చిన మార్క్‌ఫెడ్

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మిగిలిపోయిన హెచ్‌డీ నల్లబర్లీ పొగాకుని సెప్టెంబరు నెల వరకు కొనుగోలు చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం ఆ శాఖ నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలకు పైగానే మార్క్‌ఫెడ్ ప్రారంభించిన పొగాకు కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటాయని అధికారవర్గాలు తెలిపాయి. ఈ దృష్ట్యా పొగాకు రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కేంద్రాలకు తీసుకొచ్చి పొగాకుని విక్రయించుకోవాలని సూచించాయి. కేంద్రం నుంచి సహకారం లేకపోయినా బర్లీ పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసింది. అయితే వివిధ కారణాలతో ఇప్పటివరకు కేవలం రూ.44 కోట్ల పొగాకును మా త్రమే కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద భారీ మోతాదులో పొగాకు నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల వ్యవధిని సెప్టెంబరు బరకు పొడిగిస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకు న్నది. రైతులు తేమ 20 శాతం లోపు ఉన్న బేళ్లను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురా వాలని స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక రోజు ముందుగానే తమ బేళ్లను తనిఖీ చేయించుకోవాలని సూచించింది.

తిరస్కరించే బేళ్లు

నల్ల బొగులు, పచ్చగొగులు, పండుగుల్ల, ధ్వంసమైన బేళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో అనుమతించమని ఆ శాఖ అధికారులు తెలిపారు. రైతులకు అనుకూలంగా కొనుగోలు ప్రక్రియ సులభతరంగా జరిగేలా సీఎంయాప్, ఏపీఐఎంఎస్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫాంలను సంస్థ నిర్వహిస్తుందని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే రైతులు మార్క్‌ఫెడ్/వ్యవసాయ అధికారులను సంప్రదించొచ్చని సూచించారు.



జిల్లాలో కుండపోత వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి కారుమబ్బులు కమ్ముకుని విడతల వారీగా వర్షం కురిసింది. సాయంత్రానికి భారీవర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలతో పాటు, వివిధ రోడ్లపై నీరు నిలిచింది. ప్రధాన రహదార్లపై కూడా వర్షపునీరు నిలిచింది. బాపట్లలో రెండుగంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. బాపట్లలోని ప్రధాన రహదార్లపై కూడా వర్షం నీరు భారీగా నిలిచింది. ఇంజనీరింగ్ కళాశాల నుంచి నందిరాజుతోట వరకు ప్రధాన రహదారిపై అనేకచోట్ల తటాకాలను తలపించేలా నీరు నిలిచింది.



బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

రైతుల్లో హర్షం

భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వెద సాగు చేస్తున్న పొలాలకు నీరు పెట్టేందుకు తిప్పలు పడుతున్న తరుణంలో వర్షం పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షం పొలాలకు మేలు చేస్తుందని, మొలకెత్తిన పైరు పైకి ఎదుగుతుందన్నారు. కూరగాయలు, ఆకుకూరలు బెట్టకొచ్చిన సమయంలో వర్షం మేలు జరుగుతుందని సాగుదారులు తెలిపారు. బాపట్లతోపాటు చీరాల, పర్చూరు, రేపల్లె నియోజకవర్గాలలో కూడా వర్షం కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పరవళ్లు.. నారుమళ్లు!



కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు అన్ని జలాశయాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం సాగర్ జలాశయం నీటి మట్టం 567 అడుగులకు చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో మరో వారం రోజుల్లో డ్యాం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో పది రోజుల్లో సాగర్ కుడి కాల్వకు సాగు నీటి సరఫరాకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. సాగు నీటి విడుదల సమాచారం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. దీంతో వరి నారు మళ్లు పోసే పనిలో నిమగ్నమయ్యారు.

- కొనసాగుతున్న కృష్ణానదిలో వరద ప్రవాహం
- నిండుకుంటున్న జలాశయాలు
- 567 అడుగులకు చేరిన సాగర్ డ్యాం నీటి మట్టం
- పది రోజుల్లో కుడి కాల్వకు సాగు నీటి విడుదల
- వరి సాగుకు అన్నదాతలు సమాయత్తం
- నీటి వనరుల ప్రాంతాల్లో వరి నారుమళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువులు, వాగులు, బావులు, మోటార్లు ఇలా నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి నారు మళ్లు పోస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేసిన వెంటనే నాట్లు వేసేలా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎక్కువ శాతం మంది రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేశారు.

నిండుకుంటున్న సాగర్ జలాశయం

సాగర్ జలాశయానికి 67,525 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. శ్రీశైలం జలాశయానికి.. వరద ప్రవాహం పెరిగింది. 1,56,516 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో సాగర్‌కు శ్రీశైలం నుంచి నీటి విడుదల పెంచనున్నారు. ఇదే తరహాలో నీటి ప్రవాహం కొనసాగుతుందని జలవనరుల (మిగతా 7లో)



వరినారుకు విత్తనాలు చల్లుతున్న రైతులు



నిండు కుండలా సాగర్ జలాశయం



బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలిత త్రిపురసుందరిదేవికి ఆషాఢ మాస సారె

బాపట్ల,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డుసెంటర్‌లో ఉన్న శ్రీరుక్మిణీ సమేత పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుతీరిన శ్రీలలిత త్రిపురసుందరిదేవి అమ్మవారికి అషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉమామహేశ్వర భక్తబృందం సారె సమర్పించారు. దేవాలయ ప్రాంగణం నుంచి మేళతాళాలతో చీలురోడ్డు రామాలయంలో సీతమ్మవారికి సమర్పించి మరలా ఊరేగింపుగా దేవాలయానికి వచ్చి లలిత త్రిపురసుందరిదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు.

జడ్పీ ఫైల్స్!

నాకేంటి.. ఆహా నాకేంటి అంట. ఇదీ బిల్లుల చెల్లింపు సమయంలో.. కాంట్రాక్టర్లకు జిల్లా పరిషత్ అధికారుల నుంచి వస్తున్న ప్రశ్న. పర్సంటేజీలు తేలందే.. కొన్ని ఫైల్స్ ముందుకు కదలడం లేదన్న విమర్శలు జడ్పీలో ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పథకం కింద స్టడీమెటీరియల్ అందజేసిన కాంట్రాక్టర్‌ను చూపుతున్నారు. తొమ్మిది నెలలు దాటినా సదరు గుత్తేదారును కీలక అధికారి బిల్లుల చెల్లింపు విషయంలో వేధింపులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పర్సంటేజీ తేలందే ఫైల్ ముందుకు కదలదని ఉన్నతాధికారి భీష్మించు కున్నట్లు చర్చ నడుస్తోంది.

- బిల్లుల చెల్లింపుల్లో మీనమేషాలు
- చర్చనీయాంశంగా 'విద్యాజ్యోతి' బిల్లుల చెల్లింపు
- 9 నెలల నుంచి రూ.80 లక్షల ఫైల్ పెండింగ్
- పర్సంటేజీ తేలందే ముందుకు కదలని వైనం?


గుంటూరు సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లో ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. కొన్ని ఫైల్స్‌ను కీలక అధికారులు అర్థంత రంగా తొక్కి పెడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో ఫైల్‌ను నెలల తరబడి పెండింగ్‌లో పెడుతూ ఉండడం అత్యంత వివాదాస్పదమవుతోంది.తాజాగా విద్యాజ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు పుస్తకాలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌కు సుదీర్ఘ కాలం బిల్లులు చెల్లించని వైనంపై దుమారం రేగుతోంది. తొమ్మిది నెలలు గడచినా.. కీలక అధికారి మీనమేషాలు లెక్కిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. బిల్లు చెల్లింపులు కోసం భారీ మొత్తంలో ఆశించి.. ఫైల్‌ను నెలలు తరబడి తొక్కి పెట్టడంతో బాధితులు రోడ్డెక్కే పరిస్థితి దాపురించింది.

విద్యాజ్యోతి సంగతి ఇదీ

జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఏటా జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ పథకానికి విద్యా జ్యోతి అని నామకరణం చేశారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఈ స్టడీ మెటీరియల్ తయారు చేయడంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుంది. ఈ మెటీరియల్ చదవడం వల్లే 10 తరగతి పరీక్ష ఫలితాల్లో తనకు 596 మార్కులు వచ్చాయని కారంపూడి మండలానికి చెందిన విద్యార్థిని (మిగతా 7లో)

మూడు జిల్లాలకు..35 వేల పుస్తకాలు

విద్యాజ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు 2024-25 సంవత్సరానికి మొత్తం 35 వేల పుస్తకాలు సరఫరా చేశారు. గుంటూరు జిల్లా కు 11,806, పల్నాడు జిల్లాకు 17,657, బాపట్ల జిల్లాకు 5,284 చొప్పున తెనాలి కి చెందిన సంస్థ సరఫరా చేసింది. సుమారు 550 పేజీలకు పైగా ఉన్న ఒక్కో పుస్తకం ఖరీదు రూ.177గా ఉంది. పేద విద్యార్థులకు అవసరమయ్యే.. మెటీరియల్ కావడంతో అతి తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.



క్వాలిటీ పరీక్షలో ఓకే

పుస్తకాల ముద్రణ, పేపర్ నాణ్యతకు సంబంధించి హైదరాబాద్‌లోని ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా పరిషత్ అధికారులు లేఖ రాశారు. మార్చి 19న సదరు ఫైల్‌ను హైదరా బాద్‌కు పంపారు. అదే నెల 25న హైదరా బాద్ ప్రభుత్వ రంగ సంస్థ విద్యాజ్యోతి పుస్తకాల నాణ్యతను నిర్ధారిస్తూ సర్టిఫికెట్ మంజూరు చేసింది. అది వచ్చిన తర్వాత కూడా జడ్పీ అధికారులు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఫైల్ ను పెండింగ్ పెట్టడం వెనుక మర్మం ఏంటన్న ప్రశ్నలు వస్తున్నాయి.

అవీ..ఇవీ..

ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన

మార్టూరు, జూలై20 (ఆంధ్రజ్యోతి): మార్టూరు పట్టణంలో గుంటూరు వారి అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండెచికిత్స వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. డాక్టరు నాగకిరణ్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి విజయవాడలో మెరుగైన పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, జాష్టి వెంకట మోహనరావు, శానంపూడి లక్ష్మయ్య, చెరుకూరి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ పురోహిత్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఏకగ్రీవమైన నూతన కార్యవర్గం

దేశాయిపేట(చీరాల), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : దేవాంగ పురోహిత్ పరిషత్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామం ఆమోదగిరిపట్నం సాయి బాబా కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా చల్లా రామారావు, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, బాలశంకర్, రాముడు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా మల్లేశ్వర సిద్ధాంతి, హనుమంతురావు, కోశాధికారిగా మహదేవమూర్తి, ఏకాంబరం, దుర్గా ప్రసాద్, అధికార ప్రతినిధిగా నాగప్రసాద్, యువజన విభాగం ప్రతినిధిగా రాఘవ, సభ్యులుగా పరమేశ్వరయ్య, మోహన్‌బాబు, విఘ్నేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

యువత మాదకద్రవ్యాల బారిన పడొద్దు

ఇంకొల్లు, జూలై 20,(ఆంధ్రజ్యోతి) : యువత మాదకద్రవ్యాల భారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇంకొల్లు ఎస్సై సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతకు డ్రగ్స్‌తో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా చిన్నారులు డ్రగ్స్ సేవించినట్లు మీ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందజే యాలన్నారు. ఇప్పటికే అనేక మందిని గుర్తించి కౌన్సెలింగ్ చేసి యువతలో మార్పు తెచ్చామన్నారు. మండలంలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను ఎక్కడైన విక్రయిస్తే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందజేయాలన్నారు.

24న ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

ఇంకొల్లు, జూలై 20,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మారుతీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 24న గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ప్రముఖ కంపెనీలలో 300పైగా ఉద్యోగావకాశాలు ఉండగా 18-30సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ విద్యార్హత కలిగిన వారికి రూ.12,000 నుంచి రూ.20,000 వరకు జీతం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు 6302764962, 9988853335 నంబరులో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపల్ కారుమూడి శ్రీనివాసరావు కోరారు.

డ్రోన్ సహాయంతో జూదరుల అరెస్టు

ఇంకొల్లు, జూలై 20,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం గ్రామ శివారు పొల్లాల్లో పేకాట ఆడుతున్న పదిమందిని ఆదివారం డ్రోన్ సహకారంతో అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,2100 నగదు, 9 సెల్‌ఫోన్లు, 4 మోటర్‌బైకులు సీజు చేసినట్లు సురేష్ తెలిపారు. మండలంలో పేకాట నిర్వహించే శిబిరాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. పేకాట ఆడేవాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూనియర్ ఎన్‌టీఆర్ స్ఫూర్తితో అన్నదానం

చీరాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్ స్ఫూర్తితో అన్నదానం ప్రారంభించినట్లు ఎన్‌టీఆర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అన్నారు. ఆకలితో ఉన్న నిరుపేదలకు అన్నదానం చేసేందుకు పూనుకున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే ఆదివారం పట్టణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు

అద్దంకి, జూలై20(ఆంధ్రజ్యోతి): పొదిలి డిపో నుండి గుంటూరుకు అద్దంకి, రేణింగవరం మీదుగా సోమవారం నుంచి ఎనిమిది ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి తెస్తున్నట్లు పొదిలి డిపో మేనేజర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు, 6-30, 8-00, 10-00, మధ్యాహ్నం 12-30, 2-00, సాయంత్రం 3-30, 5-30 గంటలకు పొదిలిలో బయలుదేరి దర్శి, ముండ్లమూరు, అద్దంకి, రేణంగివరం మీదుగా గుంటూరు చేరకుంటాయి. తిరుగు ప్రయాణంలో గుంటూరులో ఉదయం 5-00, 8-45, 10-15, 11-45, మధ్యాహ్నం 1-45, సాయంత్రం 4-15, 5-45, 7-15 గంటలకు బయలుదేరి అద్దంకి మీదుగా పొదిలి చేరకుంటాయన్నారు. అదనంగా పొదిలి డిపో నుంచి గుంటూరుకు 8 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనుండటంతో అద్దంకి ప్రాంత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా మారనుంది.

తిమ్మాయపాలెంలో గోమాతకు సీమంతం



తిమ్మాయపాలెంలో ఆవుకు సీమంతం చేస్తున్న మహిళలు

అద్దంకి, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని తిమ్మాయ పాలెంలో గోవుకు ఆదివారం సీమంతం చేశారు. అల్లంనేని పూర్ణచంద్రరావు, పద్మజ దంపతులు తమ వ్యవసాయ క్షేత్రంలో గోమాతకు మహిళలు కుంకుమ, పూలు, చీరలు, గాజులు అందజేసి సీమంతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడి అనుమానస్పద మృతి

- ఆలస్యంగా వెలుగులోకి
- కేసు నమోదు చేసిన పోలీసులు

వేటపాలెం (చీరాల), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం విఘ్నేశ్వర కాలనీకి చెందిన ఆర్ఎంపీ వైద్యులు కృష్ణారావు(62) అనుమానస్పద స్థితిలో ఇంట్లో మృతి చెందాడు. మృతునికి ఇరువురు కుమార్తెలకు వివాహమైంది. కాగా భార్యతో సుమారు నెలక్రితం వివాదం కావడంతో, ఆమె దూరంగా ఉండడంతో ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్సై జనార్ధన్ ఇంటి తలుపులు తెరచి పరిశీలించగా కృష్ణారావు మృతి చెంది ఉన్నాడు. ఘటన జరిగిన సుమారు ఐదు రోజులు అయినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.

'ఉపాధి'లో మస్టర్ల మాయాజాలం

- స్థానికంగా లేకపోయినా ఇక్కడ హాజరు
- నేతల నుంచి అభ్యంతరాలు లేకుండా వారికి వాటాలు
- ప్రజావేదికల్లో పైవారికి సైతం మామూళ్లు
- మంత్రి రవికుమార్ దృష్టికి తెచ్చిన వెల్లలచెరువు వాసులు
- విచారణకు ఆదేశం

అద్దంకి, జూలై20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి పెరిగిపోతోంది. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా దొంగమస్టర్లకు అలవాటు పడ్డ క్షేత్రస్థాయి సిబ్బంది టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అదే పంథా కొనసాగిస్తున్నారు. గ్రామస్థాయి నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు స్థానిక నేతలకు, వారి కుటుంబసభ్యులు పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేస్తున్నారు. ఇంతటితో ఆగకుండా వారినెలాగు నొరత్తకుండా చూశాము కథా అని, ఇష్టనుసారం వారు దొంగమస్టర్లు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఏనాడు ఉపాధి పనుల ముఖం కూడా చూడని వారికి, చిరు ఉద్యోగులు, ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేసే వారికి ఎప్పుడో చనిపోయిన పోయిన వారికి చోటామోటా నాయకులకు మస్టర్లు వేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో దొంగ మస్టర్లు వేసేందుకు అలవాటు చేసిన మండల స్థాయి సిబ్బంది, అధికారులు ఆపైనా ఏదో ఒకసాకు చెప్పి వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. వారి నుంచి మాముళ్లు పుచ్చుకుంటున్నారు..! ఇక జిల్లా స్థాయి నుంచి తనిఖీకి వచ్చారంటే ఖర్చుకు లేక్కే ఉండదు. సామాజిక తనిఖీ సందర్భంగా వసూళ్ల పర్వానికి అంతే లేకుండా పోతోంది. సామాజిక తనిఖీ ప్రజావేదికకు వచ్చే జిల్లాస్థాయి అధికారికి అక్షరాల లక్ష రూపాయలు ముట్టజెప్పాల్సిందే..! ఇక సామాజిక తనిఖీ చేసే సిబ్బంది, ఇతర సిబ్బంది కి మరో లక్ష రూపాయలు ఖర్చు షరా మాములే..! సామాజిక తనిఖీకి ప్రభుత్వం నుండి ప్రతి మండలానికి రూ.2 లక్షల నిధులు విడుదల చేస్తోంది. అయితే సామాజిక తనిఖీ చేసే సిబ్బంది క్షేత్రస్థాయిలో అవకతవకలు గుర్తించినా, స్థానికంగా ఫిర్యాదులు అందినా అవి మండల స్థాయి లో జరిగే ప్రజావేదికలో మాత్రం చర్చకు రావు. ఒకవేళ సిబ్బంది ఒకింత నిజాయితీతో అవకతవలను ప్రజా వేదిక దృష్టికి తీసుకు వచ్చినా ఉన్నత స్థాయి అధికారులు మరి కొంత అదనపు సొమ్ము తీసుకొని ఆల్ కరెక్ట్‌గా ధ్రువీకరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మండల స్థాయిలో ఉపాధి పనులు పర్యవేక్షణ చేసే అధికారులు ఇక్కడిక్కడే ఒక మండలం నుండి మరో మండలానికి బది లీ అవుతూ దశాబ్దాల తరబడి పనిచేస్తూ ఒకరికొకరు సహకరించుకుంటు న్నారనే విమర్శలు బలంగా వస్తున్నాయి. అద్దంకి నియోజక వర్గంలో ప్రతి రోజు సరాసరిన 20 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వారిలో కనీసం ఐదారు వేల మందికి ప్రతిరోజు దొంగ మస్టర్లు పడుతున్నా యని అంచనా ఉంది. ఈ విషయాలను ఇటీవల సంతమాగులూరు మండలం వెల్లలచెరువులో మంత్రి రవికుమార్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం లో పాల్గొన్న సమయంలోనే స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. అదే సమయంలో ఇతర మండలాలలోనూ పలు సందర్భాలలో మంత్రి రవి కుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో రవికుమార్ ఉపాధిహామీ పథకంలో చోటు చేసుకుంటున్న అవకతవకల పై విచారించాల్సిందిగా పీడీ విజయలక్ష్మిని ఆదేశించినట్లు తెలుస్తోంది. విచారణ మొక్కుబడిగా కాకుండా అన్ని మండలాలలో పూర్తి స్థాయిలో చేపడితే ఉపాధిలో అవినీతి వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రజావేదికలో మసి పూసి మారేడు కాయ చేసినట్లు విచారణలోనూ మాయాజాలం ప్రదర్శిస్తారో లేక నిజాయితీగా విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఆవోపాతో విద్యార్థులకు చదువుల పండుగ

చీరాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో చీరాలలో చదువుల పండుగ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయ మని, ఆర్థిక సహకారంతో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ మండపంలో ఆవోపా ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు రూ.25 లక్షల విలువైన సాయం అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 109 మంది విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం, 80 మందికి వడ్డీలేని విద్యా రుణాలు, 64 మందికి ఉచిత చేయూత పురస్కారాలు, 40 మందికి వడ్డీలేని ఉపాధి రుణాలు, ఐదుగురు విద్యార్థులకు వడ్డీలేని రుణంగా ల్యాప్‌ట్యాప్‌లు అందించడం ఆనందించదగిన అంశమని చెప్పారు. అలాగే విద్యార్థులు కూడా అవకాశాలను అంది పుచ్చుకొని ఉన్నతంగా రాణించాలని సూచించారు. అంతకుముందు వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో పందిళ్లమ్మతల్లి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్త మాసు శివరంగనాయకులు, ముప్పల వెంకట రమణరావు, బొలిశెట్టి మురళీకృష్ణ ప్రేమ్, వలివేటి మురళీకృష్ణ, శ్యామసుందర రావు, వెంకట రామయ్య, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నిన్న నీటితో కళ కళ.. నేడు వెలవెల..



ఇరవై రోజుల క్రితం నీటితో కళకళలాడుతున్న కలవకూరు చెరువు, చేపలు పట్టేందుకు నీరు ఖాళీ అయిన చెరువు

అద్దంకి, జూలై20(ఆంధ్రజ్యోతి): చేపల పట్టేందుకు చెరువులు ఖాళీ చేస్తున్నారు. ఇటీవల బల్లికురవ మండలం అంబడిపూడి చెరువును ఖాళీ చేయగా ప్రస్తుతం అద్దంకి మండలం కలవకూరు చెరువును ఖాళీ చేశారు. ప్రభుత్వాలు ఏవైనా అధికారంలో ఎవరున్నా చెరువులు ఖాళీ కావడం మాత్రం షరా మాములు గానే మారాయి. 20 రోజుల క్రితం చెరువు నిండా నీటితో కళకళ లాడిన చెరువులు చేపలు పట్టేందుకు నీటిని బయటకు పెట్టడంతో పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఇలా మరికొన్ని చెరువులను కూడా ఖాళీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సాగర్ జలాలలో చెరువులను నింపి, ఇప్పుడు చేపలు పట్టేందుకు నీటిని బయటకు వృథాగా వదలడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతా స్థానికంగా ఉండే నేతల కనుసన్ననలలో సాగుతుండడంతో నోరెత్తేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులను ఖాళీ చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగానికే పదవీ విరమణ... ప్రజా సేవలకు కాదు

పర్చూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగానికే వివరమణ ఉంటుందని, ప్రజా సేవకు విరమణ ఉండదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు అన్నారు. స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో రాష్ట్ర సచివాలయంలో అడిషనల్ సెక్రటరీగా మున్సిపల్ అండ్‌అర్బన్ డెవలెప్‌మెంట్‌లో ఉద్యోగం నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉప్పుటూరి మురళీకృష్ణ పౌరసన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ, లక్ష్మీ దంపతులకు బాల్యమిత్ర బృందంతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే వారికి ప్రజల్లో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సమైఖ్య అంధ్ర ఉద్యమంలో మురళీకృష్ణ చేసిన కృషి ఎనలేనిదన్నారు. శారదా విద్యాసంస్థల డైరెక్టర్ క్రిష్ణంశెట్టి రామకోటేశ్వర రావు మాట్లాడుతూ పర్చూరు గ్రామాభివృద్ధిలో మురళీకృష్ణ చేసిన కృషిని అయన కొనియాడారు. యువత అభివద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. అనంతరం మురళీకృష్ణ, లక్ష్మీ దంపతులను గ్రామస్థులు, మిత్రులు గజమాలతో ఘనం గా సత్కరించారు. కార్య క్రమంలో డీఎస్‌పో తాటి ప్రసాద్, కఠారి సురేంద్రబాబు, కారుమూరి సీతారామయ్య, కోటా హరిప్రసాద్, డీఎస్పీ ఉప్పుటూరి రవిచంద్ర, సీఐలు అకుల అశోక్‌కుమార్, చింతా రవి, మంగళగిరి కోటేశ్వర రావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, రంగిశెట్టి ఆంజనేయులు, ఒగ్గిశెట్టి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.



మురళీకృష్ణ, లక్ష్మి దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర, చెన్నకేశవస్వామి వార్ల ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్ జిల్లా వికారాబాద్‌లో న్యాయాధికారిగా పనిచేస్తున్న లక్ష్మీ, మురళీకృష్ణ దంపతులు స్వామివార్లను దర్శించుకొని పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో వీధులు జలమయం

అద్దంకి, జూలై20 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభమైన భారీవర్షం పలు విడతలుగా రాత్రి పొద్దు పోయే వరకు కురిసింది. దీంతో అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డుపై సైతం వర్షపు నీరు ప్రవహించింది. సైడ్‌డ్రైన్లు పొంగి ప్రవహించాయి. మూడు రోజుల క్రితం భారీ వర్షానికి పదునెక్కిన భూములు ఆదివారం కురిసిన వర్షంతో పంట పొలాలలో ప్రవహించాయి. దీంతో వాగులకు సైతం నీరు చేరింది. గత నెల రోజులగా ఎండలతో ఇబ్బంది పడగా వర్షాలతో వాతావరణం చల్లబడింది. పొలాలు పదునెక్కడంతో పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మొక్కజొన్న విస్తారంగా సాగు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే సాగుచేసిన మొక్కజొన్న, నువ్వు పంటలకు జీవం పోసినట్లు అయ్యింది.

చీరాల : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారులు సైతం వంకలను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణాలు సాగించే వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర అసహనం చెందుతున్నారు. కొన్ని గంటలపాటు రోడ్లు సైతం కనుచూపు మేర కనబడిన దాఖలాలు లేవు. పట్టణంలో డ్రయిన్‌లు నిండి వ్యర్థ జలాలు రోడ్డెక్కాయి. ఈపూరుపాలెం ఎస్‌బీఐ సెంటర్, మార్కెట్ సెంటర్‌తో పాటు పలు గృహాల్లో కూడా మండల పరిధిలో నీళ్లు ఇళ్లల్లోకి చేరాయి. జాండ్రపేట. వేటపాలెం ప్రాంతాల్లో రహదారులు గుంతలగా ఉండడంతో వాహనాలు కాస్త పట్టుతప్పుతున్నాయి.

ఇంకొల్లు : ఇంకొల్లులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్ని జలమయమయ్యాయి. ఇస్లాంపేటలో వర్షపు నీరు ఇళ్లలోకి నీరు చేరింది. మురుకాల్వలు, వర్షపునీరు ఏకమై రోడ్లపై పారి వాహన దారులు పోలేనంతగా ప్రమహించాయి.రాత్రి 8 గంటల వరకు ఎడతెరపులేకుండా వర్షం పడుతూనే ఉంది.ప్రజలు బయటకు రాలేక ఇళ్లకే పరిమితమయ్యారు.

పర్చూరు : గాలి దుమారం ఎడతెరపు లేకుండా కురిసిన భారీ వర్షంతో పర్చూరులో రోడ్లు జలమయం అయ్యాయి. ఒక్కసారిగా భారీ కుండపోతగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులపై భారీగా నీరుచేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పర్చూరు - చీరాల రోడ్డులో వాగులన తలపించే విధంగా నీరు నిలిచి పోయింది.



చీరాలలో కురుస్తున్న వర్షం



ఇంకొల్లులో వీధుల్లో నిలిచిన నీరు

నేటి నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు

పంగులూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు కొప్పెరపాడు పీఏసీఎస్ గోడౌన్ వద్ద 21న సోమవారం నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పంగులూరు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పంగులూరు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో గోడౌన్‌లు నిండినందున పొగాకు కొనుగోలు కేంద్రం కొప్పెరపాడులోని పీఏసీఎస్ గోడౌన్‌వద్ద ఏర్పాటు చేసినట్లు సీఈవో లక్ష్మి తెలిపారు. మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయం నుంచి కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్ల కొనుగోలుకు సమాచారం అందిన రైతులు తూర్పు కొప్పెరపాడు కేంద్రానికి పొగాకు బేళ్లు తీసుకురావాలని సీఈవో నాగబోయిన లక్ష్మి రైతులకు సూచించారు.

అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

మార్టూరు, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకమ్మ శక్తిక్షేత్రంలో ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా ఆలయంలో అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వడపప్పు, పానకంతో పొంగళ్లు, ఆషాడం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన పూజారి ఆళహరి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కర్పూరపు రామారావు, కర్పూరపు రమేష్, దామర్ల బసవరాజు, వెంకటేశ్వరరావు తదితరులు దంపతులతో కలిసి వచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారికి ఆషాడం సారె



అమ్మవారికి సారె తీసుకొని వెళ్తున్న మహిళలు

చినగంజాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని మూలగానివారిపాలెం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి ఆషాడ సారె కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, గ్రామానికి చెందిన ఆడపడుచుల ఆధ్వర్యంలో ఆషాడ మాసం సారె కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాక్టర్‌లో చలిమిడి, అరటికాయలు, పసుపు, కుంకుములు, గాజులు, చీర, జాకెట్ తదితర వాటిని ఉంచి గ్రామ పురవీధులలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ మహిళా భక్తులు ఊరేగింపుగా పోలేరమ్మ అమ్మ వారి ఆలయానికి తీసుకొని వెళ్లారు. ఈ సందర్భందగా ఆలయ పూజారి అమ్మ వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అషాడ సారెను సమర్పించారు. తదనంతరం గ్రామంలోని మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలుకు చెందిన ఉపాస్ వైద్యశాల వైద్యులు డాక్టర్ జగదీష్ అన్నారు. మండల కేంద్రమైన పంగు లూరులో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాస్ వైద్యశాల వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జగదీష్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పి.జయవర్ధన్ మరియు కంటి వైద్యనిపుణులు పాల్గొని 340 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. 22 మంది రోగులకు మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి ఎన్‌టీఆర్. వైద్యసేవాట్రస్ట్ ఉపాస్ వైద్యశాలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఉపాస్ వైద్యశాల జీఎం ఆనంద్, పీఆర్‌వో తాళ్లూరి రామాంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పూసపాటి సాంబ శివరావు, కోళ్లపూడి సురేష్‌బాబు, అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్ర ఆచారి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు.. నారుమళ్లు !

(5వ పేజీ తరువాయి)

శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 247 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో కుడి కాలువ ఆయకట్టులో సాగుకు భరోసా వచ్చింది.

రాయితీ విత్తనం మాటేంటి?

సాగర్ కుడి కాల్వకు సాగు నీటిని విడుదల చేసేందుకు ఒకవైపు జలవనరుల శాఖ సమాయత్తమవుతుండగా.. వ్యవసాయ శాఖ మాత్రం సాగుపై ఇంకా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే వరి విత్తనాల నిల్వలు సిద్ధం చేసి.. రైతులకు రాయితీపై సరఫరా చేయాల్సి ఉంది. కానీ, వ్యవసాయ శాఖ విత్తన పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి రైతులు విత్తనం కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తన రాయితీని వారు కోల్పోతున్నారు. జిల్లాలో 1,33,400 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. ఈ మేరకు వరి విత్తనం సిద్ధం చేయలేదు. గతేడాదీ వరి విత్తన కొరత వెంటాడింది. విత్తనం సకాలంలో లభించక రైతులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. జిల్లాలో 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బీపీటీ-5204, జేజీఎల్ -354, కేఎన్ఎం-1638, ఎన్ఎల్ఆర్ -34449, అంకుర్ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ -2782, బీపీటీ-2846 రకాల విత్తనాలు సరపడా నిల్వలు డీలర్ల వద్ద ఉంచాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారే తప్ప.. క్షేత్ర స్థాయిలో చర్యలు కానరావడం లేదు.

జడ్పీ 'ఫైల్స్'!

(5వ పేజీ తరువాయి)

వెల్లడించింది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ మెటీరియల్‌ను తెనాలికి చెందిన ప్రముఖ ప్రింటర్స్ కారు చౌక ధరకు ముద్రించి.. పేద పిల్లలకు అందజేస్తున్నారు.

9 నెలలు దాటినా

విద్యాజ్యోతి మెటీరియల్ టెండర్లు ముగిసి దరిదాపుగా తొమ్మిది నెలలు దాటింది. 35 వేల పుస్తకాలు పంపిణీ చేసినందుకు గాను సుమారు గా రూ.80 లక్షలు వరకు బిల్లులు చెల్లించాలి. జడ్పీ అధికారులు మాత్రం ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

పర్సంటేజ్ కోసం పట్టు?

కొన్ని కీలకమైన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్ ఉండటం వెనుక అసలు సంగతి వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు తమకు రావాల్సిన పర్సంటేజ్ ఫైనల్ అయిన తర్వాతే కొన్ని ఫైళ్లు పరుగులు పెడుతున్నట్లు చెబుతున్నారు. మొత్తమ్మీద విద్యా జ్యోతి ఫైల్ కూడా అందుకే పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతుంది.



వరదలున్నా..
వెలవెలే...!

- కృష్ణా, గోదావరిలో పుష్కలంగా నీరు
- ఆశించిన స్థాయిలో జిల్లాకు రాని కృష్ణాజలాలు
- రోజుకు 3,300 క్యూసెక్కులతోనే సరి!
- 10 వేల క్యూసెక్కులు వస్తేనే ప్రయోజనం
- రెండు జలాశయాల్లో 90 టీఎంసీల ఖాళీ
- లోటు వర్షపాతంతో రైతుల్లో ఆందోళన
- పట్టీపట్టనట్లుగా ప్రజాప్రతినిధులు

నెల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో కృష్ణా, గోదావరి నదుల పరివాహకాలు కళకళలాడుతున్నాయి. పెన్నా పరివాహకం మాత్రం వెలవెలబోతోంది. కృష్ణా జలాలను సోమశిలకు తరలించే అవకాశం ఉన్నా, దాన్ని వినియోగించు కోవడం లేదు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో కృష్ణాజలాలు జిల్లాకు రావడం లేదు. రోజుకు 10 వేలకుపైగా క్యూసెక్కుల నీటిని సోమశిలకు తరలించేందుకు వీలున్నా, 3,300 క్యూసెక్కులకు మించి రావడం లేదు. కృష్ణా పరివాహకంలో ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురిశాయి. దీంతో శ్రీశైలం జలాశయానికి రికార్డు స్థాయిలో వరద వచ్చి చేరుతోంది. శ్రీశైలం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ఇప్పటికే అక్కడ 201 టీఎంసీల నీరు చేరాయి. ఇంకా ఇన్‌ఫ్లో లక్షన్నర క్యూసెక్కులకు పైగానే వస్తోంది. సాధారణంగా శ్రీశైలం నీటి మట్టం 854 అడుగులు దాటితే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమశిలకు తరలించేందుకు వీలుంది. ప్రస్తుతం శ్రీశైలం నీటిమట్టం 882 అడుగులు దాటింది. పదిరోజుల క్రితమే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి సోమశిలకు నీటి విడుదల ప్రారంభించారు. అయితే ఆశించినంత ఎక్కువ నీటిని సోమశిలకు మళ్లించడంలేదు. సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో ఉన్న నీరు ప్రస్తుత పంట సాగుకు సరిపోతుంది. వచ్చే నెలాఖరుకు ఈ రెండు జలాశయాలు ఖాళీ అవుతాయి. అయితే ఇప్పటి నుంచే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వీలైనంత ఎక్కువగా కృష్ణా జలాలను సోమశిల, కండలేరులకు తరలిస్తే భవిష్యత్‌పై ఆందోళన చెందాల్సిన అవసరముండదు. ప్రస్తుతం రెండు జలాశయాల్లో 90 టీఎంసీల వరకూ నీటి నిల్వ ఖాళీ ఉంది. గతేడాది కూడా ఇదే పరిస్థితులు ఉండగా, అప్పుడు ముందుచూపుతో ఆలోచించిన ప్రభుత్వం.. 60 టీఎంసీలకు పైగా కృష్ణా జలాలను సోమశిల, కండలేరులకు తరలించింది. ఇప్పుడు కూడా ఈ జలాశయాలను నింపాలని రైతులు కోరుతున్నారు.

● జిల్లాలో లోటు వర్షపాతం

ఈ ఏడాది జిల్లాలో ఆశించినంతగా వర్షాలు కురవలేదు. సాధారణంగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్, జూలై నెలల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుంటాయి. ఆ వర్షాలు రెండో పంటకు ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ ఆ పరిస్థితి లేకపోవడంతో జలాశయాల్లోని నీటినే సాగుకు వాడాల్సి వస్తోంది. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం 95 మి.మీగా నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 50 మి.మీ మాత్రమే కురిసింది. అంటే దాదాపు సగం వర్షపాతం లోటు ఉందన్నమాట.

● పట్టించుకోకపోతే ఎలా..?

ప్రస్తుతం సోమశిల, కండలేరు జలాశయాల్లో ఉన్న నీరు జరుగుతున్న పంట సాగుకే సరిపోతుంది. ఈ సాగుకు పోను డెడ్ స్టోరేజీ మిగులుతుంది. ఇక వర్షాలు కురిస్తేనే రబీలో సాగు చేసుకోవాలి. దీంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అయినా జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఒక్క జిల్లా స్థాయి సమావేశం కూడా నిర్వహించలేదు. ఈనెల 17న డీఆర్సీ నిర్వహించాలని భావించినా అది కూడా జరగలేదు. ప్రస్తుతం కృష్ణా జలాలను తీసుకొచ్చేందుకు ప్రజాప్రతినిధులంతా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



రిజర్వాయర్లలో నీటి నిల్వ వివరాలు

ప్రాజెక్టు పేరు	పూర్తి నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఖాళీ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కులు)
శ్రీశైలం	215.81	201.58	14.23	1,56,516	89,338
సోమశిల	78	27.65	50.36	3347	5166
కండలేరు	68.03	28.81	39.23	0	2900



శాకంబరిగా కొలువుదీరిన కామాక్షితాయి

శాకంబరిగా కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం,జూలై20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం కామాక్షితాయి అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలు మూలల నుంచి తరలి వచ్చిన ముత్తైదువలు, సమరసత సేవా ట్రస్టు సభ్యులు కామాక్షితాయికి సారె సమర్పించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు కూడా అమ్మవారికి సారె సమర్పించారు. వారికి ఆలయ సేవా కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి దంపతులు, సభ్యులు,ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి, తదితరులు ఘనస్వాగతం పలికారు. వేమిరెడ్డి దంపతుల వెంట కమిటీ సభ్యులు, నందకుమార్, సుధాకర్, శ్రీనివాసులు, స్థానిక టీడీపీ నాయకులు ఉమ్మయ్యస్వామి, రత్నం, నరసింహ, బుచ్చి చైర్‌పర్సన్ సుప్రజ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

నేడు అంగన్‌వాడీల ఆందోళన

- కనీస వేతనం కోసం, యాప్‌ల రద్దు కోరుతూ...
- సీడీపీవో కార్యాలయాల వద్ద ధర్నా



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)

నెల్లూరు (హరనాథపురం), జూలై 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు ఆందోళనబాట పట్టారు. సోమవారం జిల్లాలోని అన్నీ సీడీపీవోల కార్యాలయాల వద్ద ధర్నా చేయనున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా, చాలీచాలనీ జీతంలో జీవనాన్ని సాగిస్తున్నామని వారు వాపోయారు. అంతేకాక వివిధ యాప్‌లతో పనిభారం పెరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ప్రధాన డిమాండ్లు ఇవే...

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషణ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లను రద్దు చేయాలి.
- కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- పెన్షన్, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి.
- వేతనాలు, అలవెన్సులు, అద్దెలు, మొబైల్ ఫోన్లు, రీచార్జిలకు సంబంధించిన బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి.

పోరు ఉధృతం చేస్తాం..



అంగన్‌వాడీలు ఏళ్ల తరబడి చిన్నారులు, గర్భిణులు, బాలింతల సేవలో ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న క్రమంలో చాలీచాలనీ వేతనాలతో జీవనం గడపలేక పోతున్నారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన యాప్‌లను రద్దు చేసి, పనిభారం తగ్గించాలి. సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాటను ఉధృతం చేస్తాం.

- ఏలూరు సుజాతమ్మ, జిల్లా అధ్యక్షురాలు
అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

బిల్లులు వస్తేనే..
ఇళ్లు!

- అర్ధంతరంగా ఆగిన నిర్మాణాలు
- అసంపూర్తిగా 29 వేల గృహాలు
- చేసిన పనులకు డబ్బుల కోసం కాంట్రాక్టర్ల నిరీక్షణ

నెల్లూరు (జడ్పీ), జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదల పక్కాగృహాలకు పట్టిన గ్రహణం వీడలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటాలకే పరిమితమైన నిర్మాణాలపై ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినా, నిర్మాణాలు వేగవంతం కాలేదు. గత ప్రభుత్వంలో ఆప్షన్-3ద్వారా కాంట్రాక్టర్లతో ఇళ్లనిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని నిర్మాణాలు పూర్తి చేసి, బిల్లులు అధికంగా వసూలు చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అయితే ప్రభుత్వం మారడంతో పక్కా ఇళ్ల నిర్మాణాల్లో మళ్లీ కదలిక వచ్చింది. గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి జిల్లాకు వచ్చి, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలన్నింటినీ పూర్తిచేసి, పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని ఆదేశించారు. అలాగే వచ్చే ఏడాది మార్చి నాటికి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు కట్టిన నిర్మాణాలన్నింటినీ పరిశీలించి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ఆ నిర్మాణాలను అదే కాంట్రాక్టర్‌తో పూర్తిచేయించాలని, లేని పక్షంలో ఇతరులకు అప్పగించి పూర్తిచేయాలని కూడా అధికారులను ఆదేశించారు.

● కాంట్రాక్టర్ల చేతిలో 29వేల ఇళ్లు

జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టర్లు కట్టే ఇళ్లు 29వేలు ఉండగా, వాటిలో కేవలం 6వేల గృహాలు మాత్రమే కొంతమేరకు పూర్తిచేశారు. మిగతా గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించి జరిగిన పనులకు దాదాపుగా రూ.3.5కోట్ల బిల్లులను కాంట్రాక్టర్లకు మంజూరు చేయాల్సి ఉంది. ఆ బిల్లులు మంజూరైతేనే మిగతా పనులను కాంట్రాక్టర్లు పూర్తిచేసే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చికల్లా పక్కాగృహాల నిర్మాణాలను పూర్తిచేయాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం బిల్లుల మంజూరుకు సుముఖత వ్యక్తం చేసింది. అయితే గృహనిర్మాణశాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నుంచి స్పందన తక్కువగా ఉండడంతో బిల్లుల మంజూరుకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పాత బిల్లులు మంజూరు చేయిస్తేతప్ప పక్కా ఇళ్ల నిర్మాణంలో కదలిక వచ్చే అవకాశం లేదు.



పొదలకూరులో అసంపూర్తిగా ఉన్న ఇళ్లనిర్మాణాలు

గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కుతున్న పొగాకు రైతులు.... పెట్టుబడిలో సగం కూడా కళ్లజూడలేమన్న ఆందోళనలో మిర్చి రైతులు.. రోజూ వింటూనే ఉన్నాం... చూస్తూనే ఉన్నాం. అయితే వీరికన్నా దారుణమైన పరిస్థితి పప్పుదినుసులు, అపరాలు సాగుచేసిన రైతులది. శనగలు, మినుములు, పెసలు, కందులు... ఇలా ఏ పంట చూసుకున్నా గిట్టుబాటు ధర లేక, ఉన్న ధరలకు తెగనమ్ముకోలేక రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.



కందుకూరు సమీపంలోని శీతల గిడ్డంగిలో నిల్వ ఉన్న శనగల బస్తాలు

'గిట్టుబాటే' సమస్య

- ఏ పంటకూ ధర రాక రైతుల అయోమయం
- శీతల గిడ్డంగుల్లో మగ్గుతున్న పప్పుదినుసులు, అపరాలు
- కేంద్రం నిర్ణయంతో సగానికి పడిపోయిన రేట్లు

కందుకూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ఏడాది మార్కెట్ ధరలతో పోలిస్తే అన్నిరకాల పప్పు దినుసులు, నూనెగింజల ధరలు సగానికి సగం తగ్గాయి. గత రబీ సీజన్‌లో పంటలు సాగు చేసే సమయానికి ఉన్న ధరలు, చేతికొచ్చే సమయానికి లేవు. దీంతో ధరలు పెరిగాక అమ్ముకోవచ్చని రైతులు శీతల గిడ్డంగుల్లో దిగుబడులను నిల్వచేశారు.ఈ ఏడాది మార్చిలో దిగుబడి అయిన పంట ఉత్పత్తులను కూడా గిట్టుబాటు ధరపై ఆశతో నిల్వ చేసిన రైతులు దిక్కుతోచని స్థితిని అనుభవిస్తు న్నారు. ఒకవైపు కోల్డ్ స్టోరేజీల అద్దెలు... మరోవైపు రెండేళ్లుగా పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులపై పెరుగుతున్న వడ్డీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● సగానికి సగం తగ్గిన ధరలు

పప్పు శనగల ధర 2024 మార్చికి ముందు క్వింటాల్ కాగ్ 2 రకం రూ. 12,500 వరకు పలకగా, మే నాటికి క్వింటాల్ రూ. 7వేలకు పడిపోయింది. ప్రస్తుతం క్వింటాల్ రూ. 6200 మాత్రమే ఉంది. అలాగే దేశీరకం శనగలు కూడా అప్పట్లో క్వింటాల్ రూ. 9వేల వరకు పలకగా, ప్రస్తుతం నాణ్యతను బట్టి క్వింటాల్ రూ. 4500 నుంచి రూ. 5500 ధర మాత్రమే పలుకుతోంది. అలాగే మినుములు 2024 మార్చికి ముందు వరకు క్వింటాల్ రూ. 10వేలకు తక్కువ కాకుండా సరుకు నాణ్యత బాగుంటే రూ. 11వేలు వరకు కొనుగోలు చేశారు. అవే మినుములు ప్రస్తుతం క్వింటాల్ రూ. 5వేలు నుంచి 6వేలు ధర పలుకుతోంది. కందులు, పెసర్లు కూడా రెండేళ్లనాటి ధరతో పోలిస్తే క్వింటాల్ కు రూ. 5వేలు వరకు ధర పతనమైంది. ఇక నువ్వులు, పొద్దుతిరుగుడు లాంటి నూనె గింజలకూ గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కందుకూరు ప్రాంతంలో వేలాది ఎకరాల్లో శనగ, మినుము సాగుచేస్తారు. కాబట్టి 2లక్షల క్వింటాళ్ల శనగలు, 60వేల క్వింటాళ్ల మినుములు శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంటాయని అంచనా వేస్తున్నారు. కందుకూరు ప్రాంతంలోని శీతల గిడ్డంగుల్లో పట్టిక సింగరాయకొండ, టంగుటూరు, కొండపి, ఒంగోలు లాంటి ప్రాంతాల్లో కూడా ఇక్కడి రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేశారు.



మినుములు

కేంద్రం నిర్ణయాలే కారణం

కేంద్ర ప్రభుత్వం దేశంలో పప్పుధాన్యాల కొరతను తీర్చాలన్న లక్ష్యంతో ఓవైపు పప్పుదినుసుల అభివృద్ధి పథకం పేరుతో అనేకరకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తూ , మరోవైపు ఇబ్బడి ముబ్బడిగా విదేశాల నుంచి దిగుమతులకు అనుమతులు ఇవ్వటమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా, బ్రెజిల్ లాంటి దేశాలు, మరికొన్ని ఆసియా దేశాల నుంచి పెద్దఎత్తున శనగలు, మినుములు, కందులు దిగుమతి అవుతుండటంతో దేశీయంగా ధరలు పతనమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వంపై ఒత్తిడితెస్తే తప్ప ధరల పతనం నుంచి బయట పడలేమని రైతులు పేర్కొన్నారు.

సమన్వయంతోనే ప్రజలకు సత్వర న్యాయం



పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు(క్రైం), జూలై 20(ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ, పోలీసుశాఖల సమన్వయంతోనే ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా న్యాయాధికారి జీ. శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ జీ. కృష్ణకాంత్ అర్థ వార్షిక నేరసమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ పోలీసులు సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించి, ప్రజాజీవనంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. కొత్త చట్టాలు అమలులో ఉన్నందున వాటిపై క్షుణ్ణంగా అవగాహన పొందాలని తెలిపారు. అనంతరం ఎస్పీ జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, ఛేదన గురించి సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించి, సీడీ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహంగా, సహాయకారిగా మెలిగినప్పుడే పోలీసుల పట్ల సదాభిప్రాయం ఏర్పడి విశ్వాసం పెరుగుతుందన్నారు. ఫాస్ట్ ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. గంజాయి, మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్‌నేరాలు, మాదక ద్రవ్యాలతో అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, పీపీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్ 7 లో..

జంతుబలిపై వివాదం

- భారీ బందోబస్తు మధ్య గంగమ్మకు పొంగళ్లు

లింగసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం సమీపంలోని పొలాల్లో వెలసి ఉన్న గ్రామదేవత గంగమ్మకు ఆదివారం నిర్వహించాల్సిన పొంగళ్లు, జంతుబలి విషయమై తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామాల మధ్య వివాదం నెలకొంది. అలాగే తిమ్మా రెడ్డిపాలెం గ్రామస్థులు కొత్తగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో పురాతన గంగమ్మ ఆలయంలోని విగ్రహా లను ప్రతిష్ఠ చేసే విషయమై కూడా వివాదాస్పమైంది. దీంతో రెండు గ్రామాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న గుడ్లూరు సీఐ మంగారావు ఆధ్వర్యంలో ఎస్సైలు ఎం నారాయణ, వెంకట్రావులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గంగపాలెం వాసులు గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్లు నిర్వహించి, జంతుబలి ఇస్తారని తెలుసుకున్న తిమ్మారెడ్డిపాలెం యువకులు, మహిళలు అడ్డుకునేందుకు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. దీంతో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, సీఐ మంగారావుల తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామపెద్దలను పిలిపించి చర్చించారు. ఈ సందర్భంగా గంగపాలెం గ్రామ పెద్దలు మాట్లాడుతూ పురాతన గంగమ్మ ఆలయం రెండు గ్రామాలకు చెందిందని, ఇందులోని విగ్రహాలను తిమ్మారెడ్డిపాలెం గ్రామస్థులు ఈ ఆలయ సమీపంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠ చేయాలని చూస్తున్నారని, దీన్ని ఒప్పుకోబోమన్నారు. అయితే గంగపాలెం గ్రామస్థులు పొంగళ్లు నిర్వహించుకోవచ్చని, కానీ జంతుబలి ఇవ్వకూడదని తెలిపారు. ఎందుకంటే ఆగస్టు ఒకటిన నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉందని, అంతవరకు ఆలయ సమీపంలో జంతుబలి ఇవ్వకూడదని తేల్చి చెప్పారు.



గంగమ్మ ఆలయం వద్ద ఇరువర్గాల గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతామహాలక్ష్మి, సీఐ మంగారావు

● జంతుబలి ఇస్తే చర్యలు

అధికారులు చొరవ తీసుకొని గంగపాలెం గ్రామస్థులు పొంగళ్లు మాత్రమే పెట్టుకోవాలన్నారు. తిమ్మారెడ్డిపాలెం గ్రామస్థులు కూడా ఆగస్టు 1న నూతన ఆలయంలో పొంగళ్లు నిర్వహించుకోవచ్చని, కానీ పాత ఆలయంలోని విగ్రహాలను మార్చకూడదన్నారు.ఇరువర్గాల వారు జంతుబలి ఇవ్వరాదని తహసీల్దార్ చెప్పారు. ఇందుకు రెండు గ్రామాల పెద్దలు అంగీకరించారు. కాగా సాయంత్రం 4 గంటల సమయంలో గంగపాలెం గ్రామస్థులు మేళతాళాలతో పెద్దఎత్తున తరలి వచ్చి గంగమ్మకు పొంగళ్లు నిర్వహించారు. అలాగే పోతురాజు విగ్రహానికి 101 బిందెల జలాలతో అభిషేకం చేశారు. తిమ్మారెడ్డిపాలెం మహిళలు, యువకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగగా, పోలీసులు వారిని దూరంగా తరిమి వేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్‌వో డీ మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	131
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	258

కోడిగుడ్ల ధర (100): 520

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9445
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ.118.80

4వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

కావలి(టౌన్), జూలై 20(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో భాగంగా సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్మికుల సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరింది. సీనియర్ సీఐటీయూ నాయకులు మధుసూదన్‌రావు శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, యూనియన్ నాయకులు టీ.శీనయ్య, క్రాంతికుమార్, మహేష్, రమేష్, షాన్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్!

● శ్రీనగర్, ఇందిరమ్మ కాలనీల మలుపులో గుంతలు

కావలి రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రహదారి మార్జిన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పట్టణంలోని కొత్త శివాలయం రోడ్డు నుంచి శ్రీనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు మలుపు వద్ద రోడ్డు మధ్యన ఏర్పాటు చేసిన తూముతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. శివాలయం దగ్గర నుంచి ముసునూరు ఇందిరమ్మకాలనీకి ఇటీవల నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో శ్రీనగర్ కాలనీ రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్థలాల్లో వర్షపు నీరు రోడ్డు దాటి ప్రవహించేందుకు సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో తూములు ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో శ్రీనగర్ కాలనీ రోడ్డు మలుపు మధ్యన తూము ఉండడంతో అక్కడ మట్టి పొయ్యకుండా వదిలేశారు. దీంతో శ్రీనగర్ కాలనీ రోడ్డు మధ్యన, ఇందిరమ్మకాలనీకి వెళ్లే రోడ్డు మార్జిన్‌లో పెద్ద గొయ్యి ఉండటంతో రాత్రి సమయాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఆ ప్రాంతంలో మరో తూము ఏర్పాటు చేసి రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యిలను పూడ్చి ప్రమాదాలు అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీనగర్ కాలనీకి వెళ్లే రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గుంత

న్యూస్ బాక్స్

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోండి

అల్లూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసులు పరిష్కరించుకోవాలని లోక్ అదాలత్ మధ్యవర్తిత్వం కేంద్రం సభ్యులు మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్టుల్లో అనేక కారణాల వలన కేసులు పేరుకుపోతున్నాయని, వాటిని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. సమయాన్ని, డబ్బుని వృథా కానీయకుండా ఈ మధ్యవర్తిత్వం కేంద్రం పనిచేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకొని పెండింగ్‌లో ఉన్న కేసుల నుండి విముక్తి పొందాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ విజయ్‌బాబు, మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్‌లు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్క నాటాలి

బిట్రగుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని వాకర్స్ అధ్యక్షుడు బీ.బర్నాడ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో కోవూరుపల్లి డిజిటల్ అసిస్టెంట్ మద్రి శ్యామ్‌సుధాకర్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. క్రీడాకారులకు స్టార్ ఫ్రెండ్స్ తిరుమల, అనిల్, శ్యామ్, రాజీవ్‌లు పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాలు, జీవన్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్.ఎస్ యాదవ్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

లింగసముద్రం, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంగిరేకులపాడుకు చెందిన టీడీపీ బీసీ నాయకుడు బత్తల వీరాస్వామి (62) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, ఆ గ్రామ మాజీ సర్పంచు ముప్పరాజు వెంకటేశ్వర్లు తదితర నాయకులు వీరాస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వీరాస్వామి మృతికి సంతపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

● టీయూసీసీ రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎన్ రాజు



మాట్లాడుతున్న డీవీఎన్ రాజు

కావలి(టౌన్), జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని ట్రేడ్ యూనియన్ కోఆర్డినేషన్ సెంటర్ (టీయూసీసీ) రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎన్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ కల్యాణ మండపంలో టీయూసీసీ కేంద్ర కమిటీ సభ్యుడు టీ.రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన నేతాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమా వేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

నూతన కమిటీ ఎంపిక : నేతాజీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కావలి శాఖ నూతన కమిటీ అధ్యక్షుడుగా కే.ఏసు, ఉపాధ్యక్షుడుగా శెట్టిపల్లి మనోహర్, ప్రధాన కార్యదర్శిగా శెట్టిపల్లి రవి, సంయుక్త కార్యదర్శిగా భాను ప్రకాష్, కోశాధికారిగా ఆదిలక్ష్మి, జాయింట్ కోశాధికారిగా ఎలమం దలయ్య ఎంపికయ్యారు.

భార్యపై భర్త కత్తితో దాడి

దగదర్తి(బిట్రగుంట), జూలై 20(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో భర్త కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన ఆదివారం కుంటుంబ విషయమై మున్వర్ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన షేక్.మున్వర్ జీవనోపాధి నిమిత్తం కొంత కాలం క్రితం భార్యాబిడ్డలతో దగదర్తి మండలం తడకలూరుకు వచ్చారు. గ్రామంలో చికెన్ దుకాణం నిర్వహించడంతోపాటు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో భార్య సుల్తానా ప్రవర్తనపై అనుమానం ఉన్న మున్వర్ ఈనెల 18వ తేదీ గొడవ పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి కత్తితో దాడికి దిగి విచక్షణా రహితంగా కాళ్లు, చేతులను నరికాడు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం రాజుపాలెంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు భర్తే తీసుకెళ్లాడు. అక్కడ వాళ్లు వైద్యం చేసేందుకు నిరాకరించడంతో అక్కడి నుంచి ఆమెను ఆమె బంధువులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రభుత్వ వైద్యుల ద్వారా అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ జంపానికుమార్ తెలిపారు.

చంద్రబాబుకు ఆర్యవైశ్యులు రుణపడి ఉంటారు

● సీఎం చిత్రపటానికి పాలభిషేకం



సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు, టీడీపీ నేతలు

కావలి, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆర్యవైశ్యులు జీవితాంతం రుణపడి ఉంటారని కావలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ తెలిపారు. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంకు రాష్ట్ర ప్రభుత్వం 6.8 ఎకరాలు భూమి కేటాయిచి ఆయన విగ్రహం ఏర్పాటుకు తీర్మానిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు కావలి ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి ఆర్యవైశ్య ప్రముఖులతోపాటు టీడీపీ నేతలు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం, ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు స్మృతివనంను సుమారు రూ.500 కోట్లతో అమరావతిలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కూటమి నేతల రుణం ఆర్యవైశ్యులు తీర్చుకోలేనిదన్నారు. అలాగే కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆర్యవైశ్యులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే స్పందిస్తూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కీలకమైన ఏఎంసీ చైర్మన్ పదవిని ఆర్యవైశ్య నేత పోతుగంటి అలేఖ్యకు ఇచ్చారన్నారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నందుకు ఆయనకు ఊడా రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘ కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి చక్రి, టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, పోట్లూరు శ్రీనివాసులు, అమరా వేదగిరి సబ్బరాయుడు గుప్తా, తిరువీధి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జువ్వలదిన్నెలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



ప్రభుత్వ ఏడాది పాలనపై ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న మాలేపాటి, తదితరులు

బిట్రగుంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): జువ్వల దిన్నెలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి ఇందుపూరు రామో హన్‌రెడ్డి, నేతలు కడియాల గోవిందు, ఆవుల చిన్నోడు, కొండూరు వినోద్, సుబ్రమణ్యం, పోలయ్య, వాయిలశీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సేవకుడిగా పనిచేస్తా...

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు సేవకుడిలా పనిచేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని 27వ వార్డు విప్పగుంట రోడ్డులో ఆదివారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా వినాయకుడి గుడిలో పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గడచిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, శివసూర్య, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, షేక్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోంది



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్ తదితరులు

అల్లూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన కొనసాగుతోందని సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ పరిధిలోని శంభునిపాలెంలో ఆదివారం ఇంటింటికి తిరిగి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజలకు వివరించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ప్రేమగా చూడాలి

కావలి, జూలై 20(ఆంధ్రజ్యోతి): వృద్ధులను ప్రతి ఒక్కరు గౌరవంగా, ప్రేమగా చూడాలని డీఆర్ విశ్వోదయ సేవా సమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి పేర్కొన్నారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డీఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో వెంగళరావునగర్‌లోని కార్యాయంలో ఆదివారం 60 మంది వృద్ధులకు బియ్యంచ తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఉందుగా డీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేబీ సెల్ఫ్‌ఫైనాన్స్ డైరెక్టర్ మాల్యాద్రి, సమితి సభ్యులు నల్లూరు రామకృష్ణ, సతీష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతలకు పొంగళ్లు



పొంగళ్ల సామగ్రితో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ దుర్గంపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవతలైన పోలేరమ్మ, అంకాళమ్మలకు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బుట్టల్లో పొంగళ్ల సామగ్రితో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయం చుటూ ప్రదక్షణలు చేసి అనంతరం పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతోపాటు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు, ఆయురారోగ్యాలతో గ్రామం ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగాభవానీకి పాలపొంగళ్లు

వింజమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెమడకల గ్రామంలో వున్న గంగాభవానీ అమ్మవారికి ఆదివారం ఘనంగా పాలపొంగళ్లు నిర్వహించారు. యాదవ యూత్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం బండ్లు తిరుగుడు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను అందజేశారు.

రేపటి నుంచి గంధమహోత్సవం



గంధమహోత్సవానికి ముస్తాబైన దర్గా

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్ ఖాదర్‌ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా వారి 220వ గంధ మహోత్సవం మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సందల్‌మాలి కార్యక్రమంతో గంధ మహోత్సవం ప్రారంభమవుతుందని, శుక్రవారం తహలీల్ ఫాతెహా కార్యక్రమాలతో ముగుస్తుందన్నారు. గంధమహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, పాటకచ్చేరీ, ఖవ్వాలీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

'కుమ్మిత' సేవలు అభినందనీయం



సన్మానం అందుకుంటున్న కుమ్మిత దంపతులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తితో పాటు సమాజ సేవలోను కుమ్మిత శ్రీనివాసులురెడ్డి చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం జీ.కొత్తపల్లిలోని ఆయన స్వగృహంలో కుటుంబీకులు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లా డుతూ ఇటీవల జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆయన సేవాగుణానికి నిదర్శనమన్నారు. అనంతరం కుమ్మిత దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సర్పంచు కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, న్యాయవాది శేషారెడ్డి, ఎంఈవో మస్తాన్‌వలి, ఎం సుబ్బారావు, మందలపు తిరుపతినాయుడు, ఆంధ్ర బాలగురవారెడ్డి, చంద్ర వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు దుత్తలూరు మండల సమావేశం

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హనుమంతరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో చంద్రబాబు సుపరిపాలన : ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సంగం: ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు ఇస్తున్న టీడీపీ నేతలు

ఉదయగిరి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం ఉదయగిరి పట్టణంలోని దేవలాలగడ్డ, తుఫాన్‌నగర్, ఈద్గామిట్ట తదితర ప్రాంతాల్లో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీచేసి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైసీపీని గెలిపిస్తే మళ్లీ అధోగతి పాలవుతారని, పురోగతి ఉండదన్నారు. సుపరిపాలన అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● సంగం: మండలంలోని సిద్దీపురంలో అన్నారెడ్డిపాళెం సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొర్రపాటి మంజులనాయుడు, టీడీపీ బూత్ కన్వీనర్, కో కన్వీనర్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



నూతనంగా ఎంపికైన ఆశా కార్యకర్తల కమిటీ సభ్యులు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, ఉపాధ్యక్షురాలు మేరీ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో నర్రవాడ, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఆశా కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది ఒప్పంద జీవోలను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన ఆశా కార్యకర్త కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు పదవీ విరమణ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. అనంతరం 11 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ కార్యదర్శులు గుజ్జుల మల్లికార్జున, సింహాద్రి పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయు నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎలక్ట్రిసిటీ కార్మికులు, యుటీఎఫ్, ఎల్‌ఐసీ తదితర అనుబంధ సంఘాల నాయకులు ఆదివారం ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా నాయకులు జీవీ శివప్రసాద్, మున్సిపాల్టీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, యుఈఈయు రీజనల్ అధ్యక్షుడు కొండమూరి హజరత్తయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబరు 36 ప్రకారం వెంటనే జీతాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి రాధమ్మ, రమణమ్మ, ఎల్ఐసీ, యుటీఎఫ్, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు టి రమేష్, బి శివప్రసాద్, యు నరసింహులు, షేక్ హయత్‌బాష, ఈఈయు డివిజన్ నాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం

ఏఎస్ పేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సుశీల నేత్రాలయ ఆసుపత్రి వారి సహకారంతో స్థానిక హబీబియా క్లినిక్‌లో డా ఖాజామియ్య ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా కంటివైద్యులు విజయ్ సుమారు 120 మందికి కంటి పరీక్షలు చేసి అందులో 40 మందికి ఆపరేషన్ అవసరం అని తెలిపారు. ఈకార్యక్రమంలో టెక్నీషియన్‌లు ఫిరోజ్, నరసింహ, మెయిద్, పిఆర్‌ఓ షాకీర్, హబీబియా క్లినిక్ సిబ్బంది, టిడిపి నాయకులు ఎంబిటి బాబు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు ఘన సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న గ్రామస్థులు

సంగం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఐదుగురు సచివాలయ ఉద్యోగులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అనంతసాగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1989-90 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన వారందరూ పాఠశాలకు చేరుకొని ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆపాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఆత్మకూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ చంద్రా విజయమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో మౌన ధ్యానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానసాధకులు తదితరులు పాల్గొన్నారు.